**విలేకరులు కావలెను**

'వజ్రభారతి' తెలుగు దినపత్రిక లో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు, మండలాలకు నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మండల విలేకరులు కావలెను.

98498 39560

Cell : 98498 39560

RNI.No : APTEL/2021/80994

Dare to Write... Dare to fight


# వజ్రభారతి

vajrabharathi@gmail.com

ఎడిటర్ : పమ్మి ఏడుకొండలు

సామాజిక, రాజకీయ జాతీయ తెలుగు దినపత్రిక

సంపుటి : 5 సంచిక : 158 ఎడిటర్ : పి.ఏడుకొండలు వెల : 2 రూపాయిలు తేది: గురువారం 4 -6-2026 పేజీలు : 8 E-mail:vajrabharathi@gmail.com




# డిసెంబర్‌లో గ్లోబల్ సమ్మిట్

- సదస్సులో పాల్గొనాలని దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడికి ఆహ్వానం
- సానుకూలంగా స్పందించిన మషాటిలే
- భారత్, దక్షిణాఫ్రికాల మధ్య చారిత్రక బంధం ఉందని వ్యాఖ్య

హైదరాబాద్: తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్--2026 కార్యక్రమాన్ని ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సదస్సులో పాల్గొనాలంటూ దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో పాటు ఆ దేశ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. సీఎం ఆహ్వానంపై మషాటిలే సానుకూలంగా స్పందించారు. బుధవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో పాల్ మషాటిలే నేతృత్వంలోని దక్షిణాఫ్రికా ప్రతినిధుల బృందంతో సీఎం సమావేశమయ్యారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, వైద్య పర్యాటకం, పరిశ్రమలు, పెట్టుబడుల విషయంలో పరస్పర సహకారంపై చర్చించారు.



## కోటి మందితో

# యోగాంధ్ర-2026



- జూన్ 21న కోటి మందితో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం
- 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' థీమ్‌తో యోగాంధ్ర-2026 కార్యక్రమం
- పర్యాటక కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక యోగా ప్రదర్శనలు
- యోగాంధ్ర కోసం రూ.10 కోట్ల బడ్జెట్, ప్రత్యేక పోర్టల్ ప్రారంభం
- జూన్ నెలను 'యోగా నెల'గా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది భాగస్వామ్యంతో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 'యోగాంధ్ర-2026' పేరుతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. జూన్ 21న జరిగే ఈ కార్యక్రమ నిర్వహణ, లక్ష్యాలపై ఆయన అమరావతిలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానం యోగా అని, దానిని ప్రజా ఉద్యమంగా మార్చి ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ ఏడాది 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' (వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా జీవించడం) థీమ్‌తో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సీఎం చెప్పారు. "యోగా కేవలం ఒక్కరోజు కార్యక్రమం కాదు, ప్రతి వ్యక్తి నిత్య సాధనగా మార్చుకోవాలి. ఈ లక్ష్యంతో

2లో

# కేంద్రంపై పోరుకు ఉమ్మడి కార్యాచరణ




- 8న ఇండియా కూటమి పక్షాల భేటీ
- 15 విపక్ష పార్టీలు హాజరయ్యే అవకాశం
- తొలిసారిగా టీవీకే పార్టీకి ఆహ్వానం

2లో

న్యూఢిల్లీ: ఇటీవల వివిధ రాష్ట్రాల ఎన్నికల ఫలితాల అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలు, కూటమిలో నెలకొన్న అభిప్రాయ భేదాల నేపథ్యంలో మరోమరు విపక్షాల ఐక్యత చాటేందుకు, కేంద్ర ప్రభుత్వంపై పోరుకు ఉమ్మడి కార్యాచరణ ప్రకటించేందుకు విపక్షాల 'ఇండియా' కూటమి పార్టీలు 8వ తేదీన హస్తినలో భేటీకానున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా తృణముల్ అధినేత్రి మమతా బెనర్జీ, సమాజ్‌వాదీ

## రెండ్రోజులు తేలికపాటి వర్షాలు

చాలా ప్రాంతాల్లో తేలికపాటి, కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు

చురుకుగా నైరుతి రుతుపవనాలు... నేడు కేరళను తాకే అవకాశం





## సంఘాలు పెట్టుకుని నాయకులు బాగుపడ్డారేమో కానీ...!

- కులాలపై పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు..
- సంఘాలు పెట్టుకుని నాయకులు బాగుపడ్డారు కానీ ఆయా కులాల ప్రజలు నష్టపోయారన్న పవన్
- గత వైసీపీ పాలనలో కుల దూషణలు, రాజకీయాలు పరాకాష్ఠకు చేరాయని విమర్శలు
- డాక్టర్ సుధాకర్, దళిత యువకుడి హత్య వంటి ఘటనలను ప్రస్తావించిన జనసేనాని
- కులాల ఐక్యతే తమ సిద్ధాంతమని, దీనికి చరమగీతం పాడతామని స్పష్టీకరణ

2లో



## సీబీఐతో విచారించాలి

- పరీక్ష నిర్వహణ, ఎంపికలో అంతులేని అక్రమాలు కనిపిస్తున్నాయి
- ఇష్టారాజ్యంగా జీవోలతో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు ఇచ్చేశారు
- దీనివల్ల అర్హులైన అభ్యర్థులకు అన్యాయం జరిగింది
- పార్టీ నుంచి లీగల్ ప్యానెల్ ఏర్పాటు చేసి వారి తరఫున న్యాయ పోరాటం చేస్తాం

2లో

# ఢిల్లీలో ఘోరం



- ఇరుకైన హోటల్‌లో భారీ అగ్ని ప్రమాదం
- 11 మంది విదేశీయులుసహా 21 మంది సజీవదహనం
- పలువురికి గాయాలు
- 35 మందిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు
- శిథిలంగా మారిన ఐదంతస్తుల భవంతి
- ప్రాణాలను కాపాడుకునేందుకు చిన్నారితో మూడో అంతస్తు నుంచి దూకిన మహిళ
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రాష్ట్రపతి, ప్రధాని

2లో

## దేశభక్తి గురించి పవన్‌కల్యాణ్ దగ్గర పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదు

- కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఫాలింగ్ జరుగుతోంది
- మోదీ-- రేవంత్ భాగస్వామ్య ప్రభుత్వం
- రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా పని చేస్తోంది
- మొదటి అర్ధభాగం అట్టర్ ఫ్లాప్.. మిగతా అర్ధభాగం మరింత అధ్వానం
- 2027లో పాదయాత్ర చేద్దామనే ఆలోచనలో ఉన్నట్లు కేటీఆర్ వెల్లడి

ఆయన సోదరుడిగా ఇంటికి వస్తే బిర్యానీ పెడతాం.. పెత్తనం చేస్తామంటే ఒప్పుకోం



# అమరావతి స్మార్ట్ సిటీకి భాగస్వామ్యం..

- రష్యా 'ఎలిమెంట్ గ్రూప్'కు నారా లోకేష్ ఆఫర్
- రష్యా సెమీకండక్టర్ దిగ్గజం ఎలిమెంట్ గ్రూప్‌తో మంత్రి లోకేష్ భేటీ
- విశాఖ, నెల్లూరు, శ్రీసిటీలలో తయారీ యూనిట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- సెమీకండక్టర్, రోబోటిక్స్, ఎలక్ట్రానిక్ రంగాల్లో పెట్టుబడులకు ఆహ్వానం
- ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన ఎలిమెంట్ గ్రూప్
- అంతర్గత చర్చల అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటన

# కోటి మందితో యోగాంధ్ర-2026

(మొదటి పేజీ తరువాయి)

జూన్ నెలను 'యోగా నెల'గా ప్రకటిస్తున్నాం. జూన్ 7 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు జరుగుతాయి" అని వివరించారు. ప్రధాన కార్యక్రమం అమరావతిలో కృష్ణానది పశ్చిమ బైపాస్ వంతెనపై 25 వేల మందితో నిర్వహిస్తామని, ప్రతి జిల్లా కేంద్రంలో 2 వేల నుంచి 3 వేల మందితో కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఎన్‌టీఆర్ జిల్లాలో పోలీసు సిబ్బంది, కోనసీమలో రైతులు వంటి ప్రత్యేక వర్గాలతో పాటు ఉండవల్లి గుహలు, శ్రీశైలం వంటి 56 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా కార్యక్రమాలు నిర్వహించి 'యోగా-టూరిజం'ను ప్రోత్సహిస్తామన్నారు. యోగాంధ్ర-2026 విజయవంతం కోసం రూ.10 కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించామని, స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో భాగంగా రాష్ట్రంలో 10 లక్షల మంది సర్టిఫైడ్ యోగా సాధకులను, 2.50 లక్షల మంది ట్రైనర్లను తయారు చేయడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు సలహాలు, సేవలు తీసుకుంటున్నామని, ఆయన రూపొందించిన 168కి పైగా వీడియోలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. 81424 04888 వాట్సాప్ నంబర్‌కు 'ఎఆ' అని మెసేజ్ పంపిస్తే యోగా వీడియోలు పొందవచ్చని సూచించారు.

# కేంద్రంపై పోరుకు ఉమ్మడి కార్యాచరణ

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ చీఫ్ తేజస్వీ యాదవ్, శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే సహా మొత్తం 15 పార్టీల అగ్రనేతలు ఈ సమావేశానికి హాజరయ్యే అవకాశాలున్నాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉమ్మడి కార్యాచరణ రూపొందించడం, ప్రతిపక్ష ఐక్యతను మరింత బలోపేతం చేయడం భేటీ ప్రధాన లక్ష్యాలుగా తెలుస్తోంది. ద్రవ్యోల్బణం, ఇంధన ధరలు, నిరుద్యోగం, ప్రతిష్టాత్మక పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు, అంతర్జాతీయ పరిస్థితులు వంటి ప్రజా సమస్యలపై సంయుక్త పోరాటానికి భేటీలో వ్యూహాలు ఖరారు చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల అనంతర పరిణామాలు, వివిధ రాష్ట్రాల్లో మారుతున్న రాజకీయ సమీకరణాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగే అవకాశముంది. అయితే 'ఇండియా' కూటమిలోని కొన్ని పార్టీల మధ్య ఇటీవల అభిప్రాయ భేదాలు బయటపడుతున్నాయి. ముఖ్యంగా రానున్న ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా పోటీ చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు వార్తలు రావడం కూటమిలో గందరోగళం నెలకొంది. 'ఇండియా' కూటమితో తెగదెంపులు చేసుకున్న ఆప్ పార్టీ ప్రతి పక్షాల కార్యక్రమాలకు దూరంగా ఉంటోంది. తమిళనాడు ఎన్నికల అనంతరం పరిణాల నేపథ్యంలో కాంగ్రెస్‌తో తన బంధాన్ని తెంచుకుంటున్నట్లు డీఎంకే ప్రకటించింది. తమిళనాడులో కాంగ్రెస్‌తో పొత్తు తెగిపోయిన నేపథ్యంలో లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీలకు దూరంగా కూర్చోవాలని డీఎంకే నిర్ణయించింది. డీఎంకే పార్లమెంటరీ పార్టీ నేత కనిమొళి కొద్ది రోజుల కిందటే లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాసి తమ ఎంపీలకు ప్రత్యేక సీటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో డీఎంకే సమావేశానికి దూరంగా ఉండే అవకాశమున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇండియా కూటమిలో డీఎంకే స్థానంలో విజయ్ జోసెఫ్ సారథ్యంలోని టీవీకే పార్టీకి ప్రాధాన్యం లభించే అవకాశాలున్నాయని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

# సీబీఐతో విచారించాలి

అమరావతి: ఒక పోస్టుకు ఒక్కరు (1:1) నిష్పత్తిలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు పిలిచి అన్నింటా సక్సెస్ అయిన అనేక మంది డీఎస్సీ 2025 అభ్యర్థులకు ఉద్యోగాలు రాకపోవడం అత్యంత హేయం.. ఇంతకంటే దారుణం మరొకటి ఉండదని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్షేపించారు. పరీక్ష నిర్వహణ, ఎంపికలో అంతులేని అక్రమాలు చోటు చేసుకున్నట్లు అభ్యర్థులు చెబుతున్న విషయాలను బట్టి తెలుస్తోందని, అందుకే డీఎస్సీ 2025పై సీబీఐతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చిన డీఎస్సీ 2025 అభ్యర్థులు బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్‌ను కలిశారు. పరీక్ష నిర్వహణ, ఎంపికలో చోటు చేసుకున్న అక్రమాలను వైఎస్ జగన్ దృష్టికి తెచ్చి తమకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. డీఎస్సీ అభ్యర్థుల ఆవేదన, బాధలను సావధానంగా విన్న వైఎస్ జగన్ వారికి న్యాయం జరిగేలా పోరాడతామని భరోసా ఇచ్చారు.

# అమరావతి స్మార్ట్ సిటీకి భాగస్వామ్యం..

ఆంధ్రప్రదేశ్‌ను హై-టెక్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ రష్యాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా, మాస్కోలో రష్యాకు చెందిన ప్రముఖ సెమీకండక్టర్ల తయారీ సంస్థ 'ఎలిమెంట్ గ్రూప్' ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అపార అవకాశాలను వివరిస్తూ, పలు కీలక ప్రతిపాదనలను వారి ముందుంచారు. ఈ సమావేశంలో ఎలిమెంట్ గ్రూప్ ప్రెసిడెంట్ ఖజోవ్ ఒలెగ్, ఇతర డైరెక్టర్లతో భేటీ అయిన మంత్రి లోకేష్, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తయారీ, డిజైన్ యూనిట్లను స్థాపించాలని ఆహ్వానించారు. భారతదేశంలో వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ రవాణా, బ్యాంకింగ్ వ్యవస్థలకు అవసరమైన ఆర్‌ఎఫ్‌ఐడీ ట్యాగ్‌లు, స్మార్ట్ కార్డ్ మైక్రోచిప్‌ల తయారీ కోసం విశాఖపట్నంలో ఒక ఎలక్ట్రానిక్ కాంపోనెంట్ అసెంబ్లీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే, దేశీయంగా పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ), సోలార్ కన్వర్టర్ల మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని నెల్లూరులో సెమీకండక్టర్ పరికరాల తయారీ యూనిట్‌ను స్థాపించాలని ప్రతిపాదించారు. ఇప్పటికే శ్రీసిటీలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆటోమోటివ్, అసెంబ్లింగ్ పరిశ్రమలకు రోబోటిక్స్, ఆటోమేషన్ సేవలు అందించేందుకు ఎలిమెంట్ గ్రూప్ తమ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని లోకేష్ సూచించారు. దీనికి తోడు, కమ్యూనికేషన్, ఏరోస్పేస్ రంగాలకు అవసరమైన మాడ్యులర్ కాంపోనెంట్లపై దృష్టి సారిస్తూ వైజాగ్ హై-టెక్ కారిడార్‌లో ఒక మైక్రోఎలక్ట్రానిక్స్ డిజైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి స్మార్ట్ సిటీ నిర్మాణంలో భాగంగా హార్డ్‌వేర్, ఐఓటీ మౌలిక సదుపాయాల కల్పనలో భాగస్వాములు కావాలని, ఇందుకు అవసరమైన మైక్రోకంట్రోలర్లు, డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను సరఫరా చేయాలని కోరారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై ఎలిమెంట్ గ్రూప్ ప్రెసిడెంట్ ఖజోవ్ ఒలెగ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో తమ కార్యకలాపాలను విస్తరిస్తున్నామని, ఇప్పటికే భారత టెక్ సంస్థలతో కలిసి సెమీకండక్టర్ పంపిణీ నెట్‌వర్క్‌లను నడుపుతున్నట్లు వివరించారు. దక్షిణాసియా మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి సారించామని, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలు ఆకర్షణీయంగా ఉన్నాయని తెలిపారు.

# ఢిల్లీలో ఘోరం



న్యూఢిల్లీ: నిబంధనలకు పూర్తి విరుద్ధంగా నడుస్తూ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఢిల్లీలోని ఫ్లోరిష్ స్టే బీ అండ్ బీ హోటల్ బుధవారం జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో మసిబొగ్గులా మారింది. తమ బంధువుల శస్త్రచికిత్సలు, వైద్యం కోసం విదేశాల నుంచి వచ్చి ఆస్పత్రి సమీప ఈ హోటల్‌లో బసచేస్తున్న పలువురు విదేశీయులు ఈ అగ్ని ప్రమాదంలో కాలిబూడిదయ్యారు. బుధవారం ఉదయం 8.30 గంటలకు జరిగిన ఈ భారీ అగ్ని ప్రమాదంలో 11 మంది విదేశీయులు సహా మొత్తంగా 21 మంది సజీవదహనమయ్యారు. మృతుల్లో 9 మంది ఆఫ్రికా దేశస్తులుకాగా ఇద్దరు తుర్క్‌మెనిస్తాన్ దేశస్తులు. పది మంది భారతీయులూ ఈ ఘటనలో చనిపోయారు. ఉదయంకావడంతో కొందరు నిద్రలోనే శాశ్వతనిద్రలోకి వెళ్లిపోయారు. అగ్ని ప్రమాదం విషయం తెల్సి అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని 35 మందిని కాపాడారు. వీరిలో 16 మందికి స్వల్ప గాయాలుకాగా 19 మంది తీవ్రగాయాలతో ఆస్పత్రుల్లో ఐసీయూలో అత్యవసర చికిత్స పొందుతున్నారు. హోటల్‌లోని అతిథులు, పోలీసులు, స్థానికులు, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారు కలిపి మొత్తంగా 58 మంది ఈ ఘటనలో ప్రభావితమయ్యారు. ఘోర అగ్నిప్రమాదం వార్త తెలిసి ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఘటనపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. సెన్సర్‌తో పనిచేసే తలుపులు మూసుకుపోయి బయటకురాలేక, అగ్నికీలల వేడిమికి తాళలేక హోటల్‌లోని అతిథులు కాపాడండి అంటూ చేసిన ఆక్రందనలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని పోలీసులు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా భవనాన్ని నిర్వహిస్తూ ఈ ఘటనలో పలువురి మృతికి కారణమయ్యాడంటూ హోటల్ యజమాని లోకేశ్ బజాజ్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. పరారీలో ఉన్న అతన్ని పోలీసులు రాత్రి పొద్దుపోయాక అరెస్టు చేశారు. ప్రమాదం వార్త తెలిసి రాష్ట్రపతి ముర్ము దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల బంధువులకు తలో రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. క్షతగాత్రులకు తలో రూ.50,000 మంజూరుచేశారు. కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్ గాంధీ సైతం మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తంచేశారు.

దక్షిణ ఢిల్లీలోని మాలవీయ నగర్‌లోని హౌజ్‌రాణి ప్రాంతంలో ఫ్లోరిష్ స్టే బీ అండ్ బీ హోటల్ ఒక ఐదంతస్తుల భవంతిలో నడుస్తోంది. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ పథకంలో భాగంగా ఈ నివాస భవంతిని పేయింగ్ గెస్ట్ మాదిరిగా నడుపుతున్నారు. ఈ హోటల్‌లో కేవలం ఆరు గదులకు అనుమతి ఇవ్వగా నిబంధనలకు విరుద్ధంగా 25 గదుల్లో విదేశీయులకు వసతి కల్పించారు. లైబీరియా, మొజాంబిక్, నైజీరియా, బంగ్లాదేశ్‌లకు చెందిన వ్యక్తులు ఈ హోటల్ గదుల్లో దిగారు. కిక్కిరిసిన హోటల్‌లో బుధవారం ఉదయం 8.30 గంటలకు ఉదయం హోటల్ కిచెన్‌లో చెఫ్ ఒక ఎలక్ట్రిక్ వస్తువును స్విచ్ఛాఫ్ చేశాక ఎలక్ట్రిక్ ప్లగ్ నుంచి మంటలొచ్చాయి. ఆర్పేలోపే గది అంతా మంటలు వ్యాపించి చివరకు భవనాన్ని అగ్నికీలలు చుట్టుముట్టాయని స్థానికుడు ఆసిఫ్ వెల్లడించాడు. క్షణాల్లో భవనం మొత్తాన్నీ అగ్నికీలలు చుట్టుముట్టాయి. సీల్ వేసిన కిటికీలు, ప్రతి అంతస్తులో సెన్సార్‌తో పనిచేసే తలుపులు అగ్నికీలల ధాటికి తెరుచుకోకపోవడంతో హోటల్‌లోని వాళ్లు తప్పించుకునేందుకు అవకాశం లేకుండాపోయింది.

# రెండ్రోజులు తేలికపాటి వర్షాలు

హైదరాబాద్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతున్నాయి. బుధవారం రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 0.5 నుంచి 1డిగ్రీ సెల్సియస్ మేర తక్కువగా నమోదయ్యాయి. మారిన వాతావరణ పరిస్థితులతో ఉష్ణోగ్రతల్లో తగ్గుదల కనిపిస్తోందని, రానున్న నాలుగు రోజుల వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. గత కొన్ని రోజులుగా అత్యధిక ఉష్ణోగ్రతలతో ఉడికిన రాష్ట్ర ప్రజలకు ఐఎండీ తాజా సూచన కాస్త ఉపశమనం ఇచ్చినట్లైంది. పశ్చిమ ఉత్తరప్రదేశ్ నుంచి ఉత్తర తమిళనాడు వరకు మధ్యప్రదేశ్, విదర్భ, తెలంగాణ, రాయలసీమ మీదుగా ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉంది. దీని ప్రభావంతో రానున్న రెండ్రోజులు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుంచి 50కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షాలు, కొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు నమోదు కావొచ్చని వాతావరణ శాఖ వివరించింది.నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. గురువారం కేరళ రాష్ట్రాన్ని తాకే అవకాశం ఉన్నట్లు వివరించింది.

# డిసెంబర్‌లో గ్లోబల్ సమ్మిట్

(మొదటి పేజీ తరువాయి)

గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ సమ్మిట్ 2025'భారీ విజయాన్ని సాధించిందని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు, దౌత్యవేత్తలు, పారిశ్రామికవేత్తలు పాల్గొనడంతో రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తాయని సీఎం గుర్తు చేశారు. ఐటీ, ఫార్మా, రక్షణ, ఏరోస్పేస్ వంటి రంగాలకు అవసరమైన నిపుణులైన మానవ వనరులను తయారు చేసి ప్రపంచానికి అందించే విధంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని చెప్పారు. ఫారరీచ్యన్ 500 కంపెనీలు తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను (జీసీసీలు) హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నాయని వివరించారు. తక్కువ ఖర్చుతో అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులో ఉండడంతో మధ్యప్రాచ్య, ఇతర అనేక దేశాల నుంచి వైద్యం కోసం హైదరాబాద్‌కు వస్తున్నారని రేవంత్ తెలిపారు. నగరాన్ని ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఈ క్రమంలో దక్షిణాఫ్రికాతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో 30 వేల ఎకరాల్లో పర్యావరణ హితంగా, నెట్ జీరో టెక్నాలజీతో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. భవిష్యత్ పరిశ్రమలు, సాంకేతిక సంస్థలు, పరిశోధనలకు ఇది కేంద్రంగా మారుతుందని వివరించారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, పారదర్శక విధానాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ కలిగిన రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల పరిస్థితులున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు చెప్పారు. బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్ల తయారీలో హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు ఉందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. వచ్చే డిసెంబర్‌లో జరిగే సమ్మిట్--2026కు తమ దేశ ప్రతినిధుల బృందంతో కలిసి పాల్గొంటామని మషాటిలే తెలిపారు.

# సంఘాలు పెట్టుకుని నాయకులు బాగుపడ్డారేమో కానీ...!

రాష్ట్రంలో కుల సంఘాలు ఏర్పాటు చేసుకుని వాటి నాయకులు బాగుపడ్డారేమో కానీ, ఆయా కులాల ప్రజలు మాత్రం అభివృద్ధికి నోచుకోకుండా తీవ్రంగా నష్టపోతున్నారని జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కులాల పేరుతో జరుగుతున్న రాజకీయాలకు చరమగీతం పాడాలని, కులాల ఐక్యతే తమ పార్టీ మూల సిద్ధాంతమని స్పష్టం చేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం పవన్ ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణమైన పొట్టి శ్రీరాములు వంటి మహనీయుడిని సైతం ఒక కులానికే పరిమితం చేసే దుస్థితి రాష్ట్రంలో నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కుల రాజకీయాలు, కుల దూషణలు పరాకాష్టకు చేరాయని పవన్ కల్యాణ్ తీవ్ర స్థాయిలో ఆరోపించారు. 1998 నుంచి మొదలైన ఈ ధోరణి, వైసీపీ పాలనలో జర్నలిస్టులను సైతం కులం పేరుతో దూషించే స్థాయికి దిగజారిందని విమర్శించారు. ఒక ఎమ్మెల్సీ, దళిత యువకుడిని హత్య చేసి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేస్తే, అధికార పార్టీ నేతలు హంతకుడిని వెనకేసుకొచ్చారని, అప్పుడు దళిత సంఘాలు సైతం మాట్లాడలేని పరిస్థితిని సృష్టించారని మండిపడ్డారు. అలాగే కరోనా సమయంలో డాక్టర్ సుధాకర్‌ను మానసికంగా హింసించి, ఆయన మరణానికి కారణమైనా ఏ సంఘాలు నోరు మెదపలేదని అన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు కుల సంఘాలు మౌనంగా ఉండిపోవడం వల్లే నాయకులు బాగుపడుతున్నారని, ప్రజలు మాత్రం నష్టపోతున్నారని వ్యాఖ్యానించారు. కుల నిర్మూలన అనే అంబేద్కర్ ఆశయం సాధ్యమో కాదో తెలియదు కానీ, కులాల మధ్య ఐక్యత, పరస్పర సహకారం నేటి సమాజానికి అత్యవసరమని పేర్కొన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగ సమస్యతో బాధపడుతుంటే, వాటిని పక్కనపెట్టి కేవలం కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే రాజకీయాలు చేయడం దారుణమని వ్యాఖ్యానించారు. ఈ కుల రాజకీయాలకు ఎక్కడో ఒకచోట ముగింపు పలకాలని తమ పార్టీ నిర్ణయించుకుందని పవన్ కల్యాణ్ తెలిపారు.



# దేశభక్తి గురించి పవన్‌కల్యాణ్ దగ్గర పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదు

హైదరాబాద్: 'తెలంగాణ రాష్ట్రానికి దశాబ్దాల తరబడి మొదటి శత్రువు కాంగ్రెస్ పార్టీ. తెలంగాణ కథలో నంబర్ వన్ విలన్ కాంగ్రెస్ పార్టీ. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన, తెలంగాణ ద్రోహి రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసి ప్రజలపై రుద్దింది. కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు మళ్లీ ముప్పు వచ్చింది. రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు వ్యతిరేకంగా పనిచేస్తూ రాష్ట్రాన్ని తిరిగి తిరోగమనంలోకి నెడుతోంది. మోదీ--రేవంత్ భాగస్వామ్య ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా పనిచేస్తోంది. మోదీ తానా అంటే కాంగ్రెస్ తందానా అంటోంది. పైన మోదీ ప్రభుత్వం ఇక్కడ జోడీ ప్రభుత్వం సాగుతోంది. మొదటి అర్ధభాగం ఇప్పటికే అట్టర్ ఫ్లాప్ అయింది. రేవంత్ పాలనలో ట్రైలర్ కాదు, ఇంటర్వెల్ కూడా పూర్తయింది. మిగతా అర్ధభాగం మరింత అధ్వానంగా ఉంటుంది. ఆయన తెలంగాణను పాతాళంలోకి తొక్కుతున్నారు. మరో 20 ఏళ్ల పాటు అధికారంలోకి రాకుండా కాంగ్రెస్ పార్టీని రేవంత్ బొంద పెడతారు..' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు వ్యాఖ్యానించారు. బుధవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా రవికాంత్‌రెడ్డి వ్యవహరించగా.. ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.విజయ్‌కుమార్‌రెడ్డి, వరికుప్పల రమేష్ పాల్గొన్నారు. ముఖ్యాంశాలు కేటీఆర్ మాటల్లోనే.. తెలంగాణ రైజింగ్ నినాదం పేరుతో ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఫాలింగ్ జరుగుతోంది. పదేళ్లలో కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, సంక్షేమం, పారిశ్రామిక రంగాల్లో సాధించిన పురోగతి ప్రస్తుతం క్షీణించింది. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ కంటే ఎక్కువ అభివృద్ధి చేశామని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా. రైతులు, యువత, మహిళలు, ఉద్యోగులు కాంగ్రెస్ హామీలతో మోసపోయారు. రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్‌ను బలహీనపరిచే కుట్ర జరుగుతోంది. ఉచిత విద్యుత్ రైతన్నలకు ఇవ్వకూడదు అన్నదే రేవంత్‌రెడ్డి సిద్ధాంతం. లేని అప్పులను ఉన్నదిగా చూపిస్తున్న కాంగ్రెస్ పార్టీని ఆర్‌బీఐ తన నివేదికతో చెంపదెబ్బ కొట్టింది.

**తెలంగాణాకు అసలైన 'ఓజీ' కేసీఆర్**

మాకు పొలిటికల్ గేర్ ఎప్పుడు మార్చాలో తెలుసు. ప్రస్తుతం ఎన్నికలు జరిగితే బీఆర్‌ఎస్‌కు 90కి పైగా అసెంబ్లీ స్థానాలు వస్తాయి. వచ్చే ఎన్నికల్లో కొడంగల్‌లో రేవంత్‌రెడ్డి ఓడిపోతారు. దమ్ముంటే ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రేవంత్ ఉప ఎన్నికలకు రావాలి. 2027లో పాదయాత్ర చేద్దామనే ఆలోచనలో ఉన్నా. బీజేపీతో పొత్తు ఉంటుందన్నది పూర్తిగా ఊహాజనిత ప్రచారం. బీఆర్‌ఎస్‌కు కేసీఆర్ ట్రంప్ కార్డు. ఆయన నాయకత్వంలో పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుంది. తెలంగాణకు అసలైన 'ఓజీ' కేసీఆర్. ఆయనే తెలంగాణను కాపాడుకుంటారు. తెలంగాణ ఖచ్చితంగా నాలుగు కోట్ల మంది తెలంగాణ భూమి పుత్రుల జాగీరు అనడంలో ఎవరికీ అనుమానం అక్కర్లేదు. ఈ నేల.. పోరాటాలు, త్యాగాలు చేసిన వారి నెత్తురుతో తడిచింది. మీరు వచ్చి మీ కుటుంబాలతో ఉండండి. మీ భూములు, వ్యాపారాలు ఇక్కడే ఉన్నాయి. గడిచిన దశాబ్దానికి పైగా కాలంలో ప్రాంతాలుగా విడిపోయినా ప్రజలుగా కలిసి ఉండాలని కోరుకున్నాం. ఉగ్రవాదం కంటే ప్రాంతీయ వాదం ప్రమాదం అని ఏపీ డిప్యూటీ సీఎం అంటున్నాడు. గతంలో ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి ఆంధ్ర విడిపోయేందుకు నిరాహార దీక్ష చేసిన పొట్టి శ్రీరాములుది కూడా ప్రాంతీయవాదమేనా? ప్రధాని మోదీ ఆయన సొంత రాష్ట్రం గుజరాత్ మీద ఉన్న అభిమానంతో తెలంగాణకు వచ్చిన పరిశ్రమలను తీసుకెళ్తున్నారు.

# ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తిచేయాలి

## రొద్దం ప్రభుత్వ ఆసుపత్రి నూతన నిర్మాణ పనులను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్

### రూ. 6 కోట్ల బెల్ (బెల్ ) కంపెనీ సీఎస్ఆర్ నిధులతో సాగుతున్న పనులు



**రొద్దం,వజ్ర భారతి జూన్ 03:-**రొద్దం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నూతన ఆసుపత్రి నిర్మాణ పనులను బుధవారం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్,అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి పరిశీలించారు.ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థ 'బెల్' కంపెనీకి చెందిన రూ. 6 కోట్ల కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్ ) నిధులతో ఈ నూతన భవన నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతోంది.ఈ సందర్భంగా నిర్మాణ స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ పనుల ప్రగతిపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. స్థానిక ప్రజలకు అత్యుత్తమ,నాణ్యమైన ఉచిత వైద్య సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ నూతన వసతుల కల్పన జరుగుతోందని పేర్కొన్నారు.ఆసుపత్రి నిర్మాణ పనులలో ఎలాంటి అలసత్వం వహించకుండా,నిర్దేశిత గడువులోగా అత్యంత వేగంగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను,అధికారులను ఆదేశించారు.ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా నిరంతరం అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆసుపత్రి సిబ్బందికి ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్,రొద్దం తహశీల్దార్ఉదయ్ శంకర్,స్థానిక రెవెన్యూ అధికారులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## జీలుగుమిల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

### వైద్య సేవలపై ఆరా తీసిన డీఎంహెచ్వో శోభ

**జీలుగుమిల్లి (వజ్ర భారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ జూన్03:** జీలుగుమిల్లి ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్వో) శోభ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోగులకు అందిస్తున్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.వైద్య సేవల నాణ్యతను మెరుగుపరచాలని సిబ్బందికి సూచనలు చేశారు.రోగులకు సమయానికి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్వో సురేష్, పీహెచ్ వైద్యాధికారి పవన్ కుమార్, ఫార్మసిస్ట్ ఎం. నాగేశ్వరరావు, ఎల్టిఎం మంగా, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్, సీహెచ్ఓ శ్రీనివాసరావు,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు లబ్ధి చేకూర్చేలా భూ రికార్డులలో పారదర్శకత: జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్

### రొద్దకంపల్లిలో 195 మంది రైతులకు 'రాజముద్ర' కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్



**రొద్దం,వజ్ర భారతి జూన్ 03:** రైతులకు లబ్ధి చేకూర్చేలా భూ రికార్డులను పారదర్శకంగా ప్రభుత్వం రూపొందించిందని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం రొద్దం మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు.మండల పరిధిలోని రొద్దకంపల్లి గ్రామంలో రీ-సర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 195 మంది అర్హులైన రైతులకు రాజముద్రతో కూడిన సరికొత్త పట్టాదారు పాసుపుస్తకాలను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కజిల్లా లెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో భూ రికార్డులను అత్యంత పారదర్శకంగా,ఖచ్చితత్వంతో నిర్వహించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టిన రీ-సర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, రైతులకు మరింత మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు రెవెన్యూ యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.కొత్త పాసుపుస్తకాలు అందుకున్న రైతులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో ఆర్డీఓ ఆనంద్ కుమార్, తహశీల్దార్ ఉదయ్ శంకర్, ఎంపీడిఓ ఆనంద్ ప్రసాద్ స్థానిక రెవెన్యూ అధికారులు,సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు ఎం శ్రీనివాసరెడ్డి

రాష్ట్ర కార్యదర్శి వైఎస్సార్సీపీ రైతు విభాగం

ఎం. మోహన్ రెడ్డి జిల్లా కార్యదర్శి, వైఎస్సార్సీపీ ఎం. చంద్రశేఖర్ రెడ్డి

తాలూకా అధ్యక్షులు, వైఎస్సార్సీపీ ఐటీ విభాగం



**తుగ్గలి జూన్ 03(వజ్ర భారతి న్యూస్):** ప్రియమైన వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులకు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి, సంక్షేమ పాలనకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు ప్రభుత్వ రెండేళ్ల పాలనకు నిరసనగా చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము.నేడు గురువారం ఉదయం 9.00 గంటలకు తుగ్గలి లో ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే శ్రీమతి దేవమ్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.కావున మండలంలోని వైఎస్సార్సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, యువత, రైతులు మరియు పార్టీ శ్రేయోభిలాషులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు అన్నారు.

### పంచాయతీలకు అడ్డాగా మారిన ఎమ్మిగనూరు

## సోమ్మప్ప సర్కిల్లోని డివైడర్

నడి రోడ్డులోనే పంచాయతీలు... ట్రాఫిక్ నిబంధనలు గాలికొదిలేసిన వైనం..!

డివైడర్ పై పంచాయతీల వలన వాహనదారులకి రోజు రోజుకి ఇబ్బంది మారుతున్న వైనం.

డివైడర్ పై కూర్చొనేవారికీ ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?...

ట్రాఫిక్ పోలీస్ లపై మండిపడుతున్న... ప్రజలు



**ఎమ్మిగనూరు జూన్ 3, వజ్రభారతి ( కర్నూల్ జిల్లా ఇంచార్జి పద్మావతి ) :** ఎమ్మిగనూరు పట్టణంలోని సోమ్మప్ప సర్కిల్ వద్ద అన్నా క్యాంటీన్ ముందు ఉన్న రోడ్డు డివైడర్ ప్రస్తుతం కొందరికి సమావేశ వేదికగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిత్యం పలువురు వ్యక్తులు డివైడర్పై కూర్చొని గంటల తరబడి ముచ్చట్లు, పంచాయతీలు నిర్వహిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన డివైడర్ను ఇలా ఆక్రమించి కూర్చోవడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రద్దీగా ఉండే ప్రాంతంలో రోడ్డు మధ్యలోనే వ్యక్తులు కూర్చోవడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం వాహనదారుల్లో నెలకొంది.ఇప్పటికే ఆ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండగా, డివైడర్పై కూర్చున్న వారిని తప్పించుకునే క్రమంలో వాహనాలు అదుపుతప్పే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారో అధికారులు సమాధానం చెప్పాలని కోరుతున్నారు.ప్రతిరోజూ ఈ దృశ్యాలు కనిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి డివైడర్ను ఆక్రమణల నుంచి విముక్తి చేసి, ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు."ప్రమాదం జరిగాక చర్యలు కాదు... ప్రమాదం జరగకముందే నివారణ చర్యలు తీసుకోవాలి" అని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

## యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారిగా డాక్టర్ జి. అమర్నాథ్ నియామకం




**తుగ్గలి, జూన్ 3 (వజ్ర భారతి న్యూస్):** మండల కేంద్రమైన తుగ్గలి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ జి. అమర్నాథ్ను కర్నూలు జిల్లా యోగాంధ్ర నోడల్ అధికారిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్ డైరెక్టర్ జి. వీరపాండియన్ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ జి. అమర్నాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. యోగా ద్వారా ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించి, ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. జిల్లా యంత్రాంగం, వైద్య సిబ్బంది, యోగా శిక్షకుల సహకారంతో యోగాంధ్ర కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తామని చెప్పారు.డాక్టర్ అమర్నాథ్ నియామకంపై స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, స్నేహితులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.



## మూలా నక్షత్రం సందర్భంగా ఎమ్మిగనూరు వేద గాయత్రిమాతకు విశేష పూజలు.

**ఎమ్మిగనూరు జూన్ 3, వజ్రభారతి ( కర్నూల్ జిల్లా ఇంచార్జి పద్మావతి ) :** ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక గీతా నగర్ లో వెలసిన శ్రీ వేద గాయత్రి మాత దేవాలయంలో బుధవారం అధిక జేష్ఠ మాసం మూలా నక్షత్రం సందర్భంగా గాయత్రి మాతకు ఆలయ అర్చకులు నరహరి శాస్త్రి విశేష అలంకరణ గావించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు అయ్యారు. అమ్మవారికి ప్రాతః కాలంలోనే అభిషేకం అర్చన, పూలఅలంకరణ చేసి ప్రసాదాన్ని నివేదించి మహా మంగళ హారతి గావించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## మీ భూమి మీ హక్కు 35 మందికి పట్టా దారులకు భూమి పాసు పుస్తకాలు పంపిణీ



**రాజవొమ్మంగి, వజ్ర భారతి, జూన్ 3. కేవిడి ప్రభాస్ :** పోలవరం జిల్లా రాజవొమ్మంగి మండలం ఎర్రంపాడు గ్రామంలో రీ సర్వే పూర్తయిన సందర్భంగా 35 మందికి పట్టాదారు పాసు పుస్తకం పంపిణీ చేయడం జరిగింది. రాజవొమ్మంగి తాసిల్దార్ అల్లు సత్యనారాయణ ఆదేశాలు మేరకు బుధవారం నాడు ఎర్రంపాడు గ్రామంలో పాసుబుక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ శాంత కుమారి మాట్లాడుతూ ఇకనుంచి ఈ పాస్ బుక్కు మీకు అన్ని విధములుగా ఉపయోగపడుతుందని భూమి పట్టా దారులకు తెలియపరిచారు దీనివల్ల వ్యవసాయానికి సంబంధించిన లోన్ తీసుకోవడానికి, విత్తనాలు తీసుకోనే సమయంలో ఇతర ఇతర సమయాల్లో తప్పనిసరి మీకు ఉపయోగపడుతుందని పై అధికారుల ఆదేశాల మేరకు ఈరోజు 35 పాసుబుక్కులు పంపిణీ చేయడం జరిగిందని తెలియపరిచారు. ఎం.పీ.టీ.సీ నల్ల సత్తిబాబు మాట్లాడుతూ గతంలో ఉన్న పాసు పుస్తకాలు ఇప్పటినుంచి పనిచేయవని ఏదైతే ఈరోజు పంపిణీ జరుగుతున్న పాసు పుస్తకాలు ఇవి రాజముద్రతో ముద్రించి ఉన్నవి వీటి నుంచి లోన్లు తీసుకోవడానికి ఎక్కడికి వెళ్ళినా మీ భూ సమస్యకు సంబంధించి ఉపయోగపడుతుందని ఈ పాసు పుస్తకాలు భద్రపరుచుకోవాలని భూమి పట్టాదారులు అందరికీ తెలియపరిచారు. అగ్రికల్చరల్ అసిస్టెంట్ శివ మాట్లాడుతూ రైతులందరికీ రాబోయే ఆగస్టు నెలలో పంట నమోదు తప్పనిసరి చేయించుకోవాలని దాని వల్ల ఉపయోగాలు రైతులందరికీ తెలియపరచి పట్టాదార్ పాస్ బుక్ ఉన్నవాళ్ళకి మాత్రమే ఎరువులు పంపిణీ చేయడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ వ్యవసాయానికి సంబంధించి విత్తనాలు తీసుకోవడానికి ప్రతి విషయంలో ఈ పట్టాదారు పాసు పుస్తకం తప్పనిసరి అని రైతులందరికీ తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ శాంతకుమారి, సర్వేర్ రాంబాబు, వీఆర్వో అన్నిక శ్రీను, ఎంపీటీసీ నల్ల సత్తిబాబు, అగ్రికల్చరల్ అసిస్టెంట్ శివ రైతులు తదితరి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## చిక్కాల శివను పరామర్శించిన జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్

**కిర్లంపూడి,వజ్రభారతి,ప్రతినిధి, జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్, జూన్, 03:-** అనారోగ్యంతో శస్త్ర చికిత్స చేయించుకున్న జనసేన నాయకుడు చిక్కాల శివను జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. కిర్లంపూడి మండలం కిర్లంపూడి గ్రామానికి చెందిన చిక్కాల శివ ఇటీవల కాకినాడలోని మౌర్య హాస్పిటల్‌లో శస్త్ర చికిత్స చేయించుకున్న విషయం తెలుసుకున్న తుమ్మలపల్లి రమేష్, బుధవారం గొల్లప్రోలు మండలం భోగాపురం గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా చిక్కాల శివ త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. అవసరమైన సమయంలో అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి జనసేన నాయకులు చిక్కాల కల్కి భగవాన్, మాదారపు వీరబాబు, పండు, గండే రాజేష్, శేశెట్టి ఉష, కంద కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం జగన్మోహన్రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ముదునూరి

### మురళీ కృష్ణంరాజు సేవా కార్యక్రమాలను అభినందించిన జగన్



**వజ్రభారతి,స్టేట్,బ్యూరో,జూన్,3:-** తాడేపల్లి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు,మాజీ సీఎం వైయస్ జగన్మోహన్రెడ్డిని ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,నరసాపురం పార్లమెంటు పరిశీలకులు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ కృష్ణంరాజు, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్,నారాయణరెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సమావేశంలో పలు పార్టీ కార్యక్రమాలు,నియోజకవర్గ అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది.అలాగే ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున ముదునూరి మురళీ కృష్ణంరాజు చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను మాజీ సీఎం జగన్మోహన్రెడ్డి అభినందించినట్లు మురళీ కృష్ణంరాజు క్యాంపు కార్యాలయం తెలిపింది

## జగ్గంపేటలో “వెన్నుపోటుకు రెండేళ్లు” పోస్టర్ ఆవిష్కరించిన తోట నరసింహం

### పార్టీ శ్రేణులతో కలిసి నిరసన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేసిన తోట నరసింహం



**జగ్గంపేట,వజ్రభారతి,ప్రతినిధి,జూన్,3:-** జగ్గంపేట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో “వెన్నుపోటుకు రెండేళ్లు” అనే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యులు తోట నరసింహం ఆవిష్కరించారు.పార్టీ శ్రేణులతో కలిసి కార్యక్రమ నిర్వహణపై ఆయన సూచనలు అందించారు.ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కార్యక్రమాన్ని గ్రామస్థాయి వరకు విస్తరించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.జూన్ 4 నుంచి 12 వరకు నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.జూన్ 4న మండల కేంద్రాల్లో టీడీపీ మేనిఫెస్టో ప్రతులు, హామీ బాండ్లు, అబద్ధపు ప్రకటనల కాపీలను దహనం చేసే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.జూన్ 8న కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై “వెన్నుపోటుకు రెండేళ్లు” పేరుతో ప్రత్యేక టౌన్ హాల్ సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు నిరసనగా జూన్ 12న నియోజకవర్గ వ్యాప్తంగా భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తోట నరసింహం తెలిపారు.ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉభయ గోదావరి జిల్లాల విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీరాంజీ,రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురామ్,నాయకులు రావుల గణేష్ రాజా,మలిరెడి పాపారావు,ఓలేటి రాజేశ్వరరావు,ఉయ్యూరి నాని,గుర్రం అబ్బు తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ ప్రతిష్ఠకు భంగం కలగకుండా ప్రతి కొనుగోలులో జవాబుదారీతనం ఉండాలి: జ్యోతుల నెహ్రూ

### తిరుమలలో టీటీడీ పర్చేజింగ్ కమిటీ కీలక సమావేశం



**జగ్గంపేట/తిరుపతి,వజ్రభారతి,ప్రతినిధి, జూన్, 03:-** తిరుమల అన్నమయ్య భవన్‌లో టీటీడీ పర్చేజింగ్ కమిటీ చైర్మన్, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో పర్చేజింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో భక్తులకు అందించే లడ్డు ప్రసాదం, అన్న ప్రసాదం నాణ్యతతో పాటు టీటీడీ అవసరాలకు సంబంధించిన వివిధ వస్తువుల కొనుగోళ్లపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్ఠకు ఎలాంటి భంగం కలగకుండా ప్రతి కొనుగోలులో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని సూచించారు.శ్రీవారి లడ్డు ప్రసాదం, అన్న ప్రసాదం తయారీలో ఉపయోగించే నెయ్యి, బెల్లం, పప్పు దినుసులు, బియ్యం సహా ప్రతి నిత్యావసర వస్తువు అత్యుత్తమ నాణ్యతతో ఉండేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు.ధాన్యం, కూరగాయలు, వంటనూనెలు తదితర వస్తువుల కొనుగోళ్లలో పూర్తి పారదర్శక విధానాలు అనుసరించాలని, భక్తులకు ఉత్తమ సేవలు అందించడమే టీటీడీ లక్ష్యమని పేర్కొన్నారు.అలాగే ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు ప్రస్తావించిన పలు సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, జీఎం పర్చేజింగ్, డిప్యూటీ ఈఓ (హౌస్ సైట్స్), ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు, పర్చేజింగ్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గజ్జెనపూడి ఉపాధి హామీ పనుల్లో అక్రమాల ఆరోపణలు

### ఫీల్డ్ అసిస్టెంట్ తీరుపై గ్రామస్థుల తీవ్ర ఆరోపణలు

### మస్టర్ రోల్స్,హాజరు నమోదులు,జాబ్ కార్డుల వ్యవహారంపై విచారణకు డిమాండ్



**వజ్రభారతి,స్టేట్,బ్యూరో,జూన్,3:-** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం గజ్జెనపూడి గ్రామంలో వీబీ జీరాంజీ (ఉపాధి హామీ) అమలుపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.గ్రామంలో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ,పథకం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ పలువురు గ్రామస్థులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఉపాధి శ్రామికులు తెలిపిన వివరాల ప్రకారం ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రాంతాలకు నిజంగా శ్రమించి పనిచేసే కూలీలకు బదులుగా ఫీల్డ్ అసిస్టెంట్‌కు సంబంధించిన బంధువులు, సన్నిహితులు,అనుచరులను ఆటోలలో పనుల ప్రదేశాలకు తరలిస్తున్నారని ఆరోపించారు.అక్కడ కొద్దిసేపు మాత్రమే ఉండి హాజరు నమోదు చేయించుకుని,పనులు చేసినట్లుగా మస్టర్ రోల్స్‌లో నమోదు చేసి,అనంతరం వారిని తిరిగి ఇళ్లకు పంపిస్తున్నారని వాపోయారు.మరోవైపు మండుటెండల్లో గంటల తరబడి కష్టపడి పనిచేస్తున్న నిజమైన కూలీలు మాత్రం తగిన గుర్తింపు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా శ్రమించిన కూలీలకు, కేవలం హాజరు నమోదుతోనే పనులు చేసినట్లుగా చూపబడుతున్న వారికి ఒకే విధంగా వేతనాలు చెల్లించడం అన్యాయమని విమర్శిస్తున్నారు.అంతేకాకుండా ఉద్దేశపూర్వకంగా కొందరి జాబ్ కార్డులను తొలగిస్తున్నారని,కొత్త జాబ్ కార్డుల కోసం వచ్చిన పేదలను వారి కులాల పేర్లతో అవమానకరంగా సంబోధిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.ఇటువంటి ప్రవర్తన ప్రభుత్వ సేవల స్ఫూర్తికి విరుద్ధమని,దీనిపై కూడా సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.గ్రామంలో జరుగుతున్న ఈ వ్యవహారంపై సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి,మస్టర్ రోల్స్,హాజరు నమోదులు,పనుల ప్రదేశాల్లోని వాస్తవ పరిస్థితులు, కూలీల వివరాలు,జాబ్ కార్డుల జారీ మరియు తొలగింపు ప్రక్రియలపై సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.అక్రమాలు జరిగి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని ఉపాధి హామీ పథకం పారదర్శకంగా అమలు అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

## డాక్టర్ అంజి నాయక్ పుట్టినరోజు సందర్భంగా భోజనం ప్యాకెట్లు అందజేత






**వజ్రభారతి,స్టేట్,బ్యూరో,జూన్,3:-** ప్రత్తిపాడు దేవర్ష్ హాస్పిటల్ ఇంచార్జ్ డాక్టర్ అంజి నాయక్ జన్మదినం సందర్భంగా ఆయన సతీమణి డాక్టర్ విజయ,కుటుంబ సభ్యుల సహకారంతో బుధవారం సేవా కార్యక్రమం నిర్వహించారు.ఏలేశ్వరం బ్రాహ్మణ భోజనం హోటల్ బేత శ్రీనివాస్,దోనేపూడి శ్రీను,పొన్నగంటి సత్తిబాబు సహకారంతో ఏలేశ్వరం బాలాజీ చౌక్ సెంటర్లో వివేకానంద సేవా సమితి అధ్యక్షులు మైర్యాల నాగేశ్వరరావు, సభ్యులు ఆధ్వర్యంలో సుమారు 100 మందికి భోజన పొట్లాలు మరియు టవల్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమాల రూపంలో నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి సభ్యులు పెండ్యాల రాజు,మల్లి బాబు,రాజబాబు,దాసరి కృష్ణ,రాజశేఖర్,పిరట్ల రవి,గొల్లపూడి త్రిమూర్తులు,జగన్,కంచర్ల రమేష్,డోర్స్ రమేష్,మెడికల్ షాప్ లక్ష్మణ్,బ్లడ్ టెస్ట్ గణేష్,నీలి పాండురంగ,హరీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



## కర్నూల్ కలెక్టర్ డాక్టర్. సిరి కీలక ఆదేశాలు జారీ..

**కర్నూల్ జూన్ 3,వజ్రభారతి ( జిల్లా ఇంచార్జి పద్మావతి ) :** కర్నూలు కలెక్టరేట్లో బుధవారం జరిగిన క్రైసిస్ మేనేజ్మెంట్ సమావేశంలో కలెక్టర్ సిరి అధికారులను అప్రమత్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు శాఖల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. ఎల్నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## పి జి సెట్ లో కొవ్వూరు డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



**తాళ్లపూడి, వజ్ర భారతి జూన్ 3:** కొవ్వూరు డిగ్రీ కళాశాల విద్యార్థులు ఏ పి పీజీ సెట్ లో ఉత్తమ ప్రతిభ కనపరచి రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంక్ లు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డా జె సునీత తెలిపారు. బోటనీ విభాగంలో బంద్రేడ్డి నాగ శ్రీలక్ష్మి కి రాష్ట్ర స్థాయిలో 65 వ ర్యాంక్, జి శిరీష కు 85 వ ర్యాంక్ లు సాధించారని అన్నారు. ఇవే కాకుండా 1000 లోపు పలు ర్యాంక్ లు తమ విద్యార్థులు సాధించారని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అభినందించి, భవిష్యత్ తో మరెన్నో ఉత్తమ ఫలితాలు కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సాధించాలని అయన ఆకాంక్షించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

## పిడుగు పడి గొర్రెలు మృతి

**కడప జిల్లా, వజ్రభారతి ఇంచార్జ్ :** కడప జిల్లా బ్రహ్మంగారి మఠం జూన్ 3 : మండల పరిధిలోని సోమిరెడ్డి పల్లె పంచాయతీ లోని గొల్లపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా పిడుగులు పడటంతో విషాద ఘటన చోటుచేసుకుంది. పిడుగు ప్రభావానికి మంగళవారం రాత్రి సుమారు ఒంటిగంట సమయంలో గ్రామ శివారులో ఉన్న గొర్రెల మందపై పిడుగు పడటంతో 14 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. విషయం తెలుసుకున్న గొర్రెల యజమానులు చనిపోయిన గొర్రెలను చూసి కన్నీరుమున్నీరయ్యారు.ఈ ఘటనతో గొర్రెల పెంపకందారులకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని తెలిపారు. సమాచారం అందుకున్న రెవెన్యూ మరియు పశుసంవర్ధక శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.పిడుగు కారణంగా 14 గొర్రెలు మృతి చెందడం గ్రామంలో విషాదాన్ని నింపిందిప్రభుత్వం బాధిత గొర్రెల యజమానులకు తక్షణ ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు, స్థానిక నాయకులు కోరారు.





## మాజీ మంత్రివర్యులు హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు

**జిన్నారం జి. వెంకటేశం గౌడ్ బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు**

**జిన్నారం మున్సిపల్,జూన్ 03, వజ్ర భారతి న్యూస్, రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):**తెలంగాణ ప్రజల హృదయాలలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న మాజీ మంత్రివర్యులు, ప్రజానాయకులు హరీష్ రావు జన్మదిన సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తెలంగాణ పోరాట ఉద్యమ నాయకులు జిన్నారం జి.వెంకటేశం గౌడ్, మాజీమంత్రి హరీష్ రావు నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తెలంగాణ ఉద్యమ పోరాట నాయకుడు జిన్నారం జి.వెంకటేశం గౌడ్, మాట్లాడుతూ...తెలంగాణ అభివృద్ధికి, రైతాంగ సంక్షేమానికి, ప్రజా సేవకు హరీష్ రావు అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా హరీష్ రావు కోట్లాది మంది అభిమానాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు.భగవంతుడు వారికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించి మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బొల్లారం బాల్ రెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు హైకోర్టు న్యాయవాది ఐలాపూర్ మాణిక్ యాదవ్, సోమిరెడ్డి,తొంట అంజయ్య యాదవ్, జగన్నాథ్ రెడ్డి, శివ, ఆనంద్, సత్యనారాయణ,తదితర బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొని హరీష్ రావుకు సమిష్టిగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## గడ్డపోతారం నూతన మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన పి.తన్య



: సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని గడ్డపోతారం మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా పి.తన్యా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పలు కార్యకలాపా లను చేపట్టారు, అనంతరం మున్సిపల్ నూతన కమిషనర్ పి. తన్యా మాట్లాడుతూఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం, తాగునీరు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. ముందుగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది నూతన కమిషనర్ కు స్వాగతం పలికి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## నేడు విద్యుత్ అంతరాయం

### గుమ్మడిదల ఏడి ఈ దుర్గాప్రసాద్

**జిన్నారం మున్సిపాలిటీ, జూన్ 03,వజ్రభారతి న్యూస్):** ఉమ్మడి జిన్నారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం (జూన్ 4) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు గుమ్మడిదల ఏ.డి.ఈ దుర్గ ప్రసాద్ తెలిపారు. 132/33 కేవీ సబ్‌స్టేషన్లలో మరమ్మత్తు పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుమ్మడిదల, జిన్నారం, బొంతపల్లి, దుండిగల్ ఎయిర్ ఫోర్స్ అకాడమీ, సోలార్ పరిశ్రమ, గడ్డపోతారం ఎస్ఎస్-1, గడ్డపోతారం ఎస్ఎస్-2 సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఈ అంతరాయం ప్రభావం చూపనుంది. నిర్వహణ పనులు పూర్తయ్యిన అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. ప్రజలు ముందస్తుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బొంతపల్లి ఏఈ రవీందర్, జిన్నారం ఏఈ తుకారాం తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రివర్యులు హరీష్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్

**పట్టాన్ చెరువు, జూన్ 03, వజ్ర భారతి న్యూస్, రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** తెలంగాణ ప్రజల హృదయాలలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న మాజీ మంత్రివర్యులు, ప్రజానాయకులు హరీష్ రావు జన్మదిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు హైకోర్టు న్యాయవాది ఐలాపూర్ మాణిక్ యాదవ్, మంత్రి వారి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఐలాపూర్ మాణిక్ యాదవ్ మాట్లాడుతూ...తెలంగాణ అభివృద్ధికి, రైతాంగ సంక్షేమానికి, ప్రజా సేవకు హరీష్ రావు అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా హరీష్ రావు కోట్లాది మంది అభిమానాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. భగవంతుడు వారికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించి మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, పటాన్‌చెరు



కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బాల్ రెడ్డి, సోమిరెడ్డి,తొంట అంజయ్య యాదవ్, జగన్నాథ్ రెడ్డి, శివ, ఆనంద్, సత్యనారాయణ,తదితర బీఆర్ఎస్ పార్టీ



నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొని హరీష్ రావుకు సమిష్టిగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## 108 సేవల మాదిరిగా మాజీ మంత్రి హరీశ్ రావు సేవలు: ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**హరీశ్ రావు జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం .. ప్రభుత్వం ఆసుపత్రి లో పండ్ల పంపిణీ, అన్నదాన కార్యక్రమం**





**సంగారెడ్డి జిల్లా, జూన్ 03, వజ్ర భారతి న్యూస్, రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో,సదాశివపేట లో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి హరీశ్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించి సామాజిక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.తదుపరి సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.అలాగే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు.అనంతరం మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్, హరీశ్ రావు సమర్థవంతమైన నాయకుడని కొనియాడారు. అధికార పక్షంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సమస్యలపై అదే స్థాయిలో స్పందిస్తూ పనిచేసే నాయకుడు హరీశ్ రావు అని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం హరీశ్ రావు పనితీరును మెచ్చుకునే వారని అన్నారు.హరీశ్ రావు మరెన్నో సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని, ఆయురారోగ్యాలతో పాటు మరింత మేధస్సు, శక్తిని దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు హరీశ్ రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, డాక్టర్ శ్రీహరి, మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్ రెడ్డి, చింత సాయినాథ్, వేణుగోపాలస్వామి, సునీల్ జై, కౌన్సిలర్లు, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





**పాతికేళ్ల తర్వాత గురువులు విద్యార్థుల కలయిక**

**ఘనంగా గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు**

**మధుర జ్ఞాపకాలతో సందడిగా వేడుకలు**

**గురు శిష్య బంధానికి ప్రతీకగా సిల్వర్ జూబ్లీ కార్యక్రమం**

**80 మంది పూర్వ విద్యార్థులుపాల్గొనడం విశేష వేల**

**పటాన్చెరు నియోజకవర్గం, జిన్నారం మున్సిపల్ జూన్ 03 (వజ్రభారతి న్యూస్):** సంగారెడ్డి జిల్లా జిన్నారం ప్రాథమిక ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు దాదాపు పాతికేళ్ల తర్వాత తమ బాల్య స్నేహితులు, చదువు చెప్పిన గురువులను ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థుల ఆనందానికి అవధులు లేకపోయాయి. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, గురువుల ఆశీస్సులు పొందుతూ జిన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000-2001 విద్యా సంవత్సరం విద్యార్థులు నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకలు మంగళవారం అత్యంత వైభవంగా జరిగాయి. మాధారం శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమం ఆప్యాయత, అనుబంధాలకు ప్రతీకగా నిలిచింది.

దాదాపు 25 సంవత్సరాల తర్వాత కలుసుకున్న సహాధ్యా యులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించు కుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. పాఠశాల రోజుల్లో జరిగిన సరదా సంఘటనలు, తరగతి గదుల అనుభవాలు, క్రీడా పోటీలు, వార్షికోత్సవాల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు. కొందరు తమ వద్ద భద్రపరచుకున్న పాత ఫొటోలను చూపించుకుంటూ ఆ రోజుల మధుర క్షణాలను మరోసారి ఆస్వాదించారు.ఈ సందర్భంగా తమ జీవితాలకు బాటలు వేసిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. గణితశాస్త్ర ఉపాధ్యాయులు అనంతరెడ్డి, ఆంగ్ల ఉపాధ్యాయులు యాదగిరి, కృష్ణారెడ్డి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు బిక్షపతి, తెలుగు ఉపాధ్యాయులు శర్మలను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. గురువుల పట్ల తమకున్న గౌరవం, ప్రేమను చాటుకుంటూ వారి ఆశీస్సులు పొందారు.

పూర్వ విద్యార్థులలో పలువురు నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవడం గురువులకు ఆనందాన్ని కలిగించింది,ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారవేత్తలు,వివిధ సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న తమ శిష్యులను చూసి ఉపాధ్యాయులు గర్వం వ్యక్తం చేశారు. “విద్యార్థుల విజయమే గురువులకు నిజమైన గౌరవం” అని పేర్కొంటూ, జీవితంలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు.విద్యార్థి దశలో గురువులు అందించిన మార్గదర్శకత్వం తమ జీవితాన్ని తీర్చిదిద్దిందని పలువురు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. క్రమశిక్షణ, విలువలు, సమాజపట్ల బాధ్యత వంటి అంశాలను గురువుల నుంచే నేర్చుకున్నామని గుర్తు చేసుకున్నారు. తమపై గురువుల ప్రేమాభిమానాలు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటూ, భవిష్యత్తులో కూడా ఇటువంటి సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించారు.సుమారు 80 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్న ఈ సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆత్మీయతకు, గురు-శిష్య, బంధానికి ప్రతీకగా నిలిచాయి. పాతికేళ్ల తర్వాత కలుసుకున్న ఈ కలయిక అందరి హృదయాలను హత్తుకుని, మరపురాని అనుభూతులను మిగిల్చిందని గురువుల ఆశీస్సులు, స్నేహితుల అనుబంధాలు జీవితాంతం తమతోనే ఉంటాయని పూర్వ విద్యార్థులు భావోద్వేగంగా మరి మధ్రాక్షణాలను గుర్తు చేస్తూ పేర్కొన్నారు.



## 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో నర్సాపూర్ రేంజ్ ఆధ్వర్యంలో వరల్డ్ బైసైకిల్ డే

**ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి: ఎఫ్ ఆర్ ఓ దివ్య**




**మెదక్ నర్సాపూర్ మున్సిపల్, జూన్ 03 వజ్ర భారతి న్యూస్,జిల్లా రిపోర్టర్ (బి.మహేందర్):**మెదక్ జిల్లా నర్సాపూర్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని సిబ్బంది ఎఫ్ ఆర్ ఓ దివ్య ఆధ్వర్యంలో నర్సాపూర్ అటవీ కార్యాలయం నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు నిర్వహించిన ఈ సైకిల్ ర్యాలీలో అటవీ శాఖ సిబ్బంది, అధికారులు పాల్గొని పర్యావరణ పరిరక్షణ, చెట్ల పెంపకం, కాలుష్య నియంత్రణపై ప్రజలకు సందేశం అందించారు. పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి వ్యక్తి సైకిల్ వినియోగాన్ని ప్రోత్సహించాలని, తద్వారా ఇంధన వినియోగం తగ్గి కాలుష్యం నియంత్రణకు దోహదపడుతుందని అటవీ క్షేత్రాధికారిదివ్య తెలియజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సిద్ధిరాంసింగ్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు సాయిరాం, కలియుముద్దీన్, రాజమణి శ్రీధర్ మరియు రేంజ్ బీట్ అధికారులు బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోళ్లు మందగింపు..
## వర్షానికి తడుస్తున్న ధాన్యం

**లారీల కొరతతో రైతులకు ఇబ్బందులు**

**తక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన బిఆర్ఎస్ నాయకులు డిమాండ్**

**గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపావని కుమార్ గౌడ్**




**సంగారెడ్డి జిల్లా, గుమ్మడిదల మున్సిపాలిటీ, జూన్ 03, (వజ్ర భారతి న్యూస్):** కొనుగోలు కేంద్రాలకు చేరిన వరి ధాన్యం తరలింపులో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ తెలిపారు. లారీల కొరత కారణంగా ధాన్యం కేంద్రాల్లోనే పేరుకుపోతోందని, అకాల వర్షాలతో తడిసిపోతూ రైతులకు నష్టం కలిగే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. గుమ్మడిదలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, గుమ్మడిదల రైతు సంఘం అధ్యక్షులు అమ్మగారి సదానంద్ రెడ్డి కలిసి ఆయన మాట్లాడారు.కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. రైతులు ఎండనక, వాననక కష్టపడి పండించిన పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే రోజుల తరబడి అక్కడే నిల్వ ఉండిపోతోందన్నారు. స్థానికంగా అన్నపూర్ణ బాయిల్డ్ రైస్ మిల్లు అందుబాటులో ఉన్నప్పటికీ ధాన్యాన్ని ఇతర ప్రాంతాలకు కేటాయించడం వల్ల రవాణా సమస్యలు తలెత్తుతున్నాయని విమర్శించారు. లారీల కోసం రైతులు రాత్రి వరకు టోల్‌గేట్ల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, అధికారులకు పలుమార్లు వివరించినా ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని పేర్కొన్నారు. సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తున్నప్పటికీ ధాన్యం తరలింపు ప్రక్రియ వేగం అందుకోవడం లేదన్నారు. వర్షాల కారణంగా ధాన్యం తడిసి నాణ్యత దెబ్బతింటే రైతులకే నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి తగినన్ని లారీలను సమకూర్చాలని, స్థానిక మిల్లులకు ధాన్యం కేటాయించి కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరారు. రైతుల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని, లేకపోతే రైతాంగంతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారిగా తుగ్గలి ఆయుర్వేద డాక్టర్ జి.అమర్నాథ్ నియామకం

**తుగ్గలి:** మండల కేంద్రమైన తుగ్గలి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ జి.అమర్నాథ్‌ను కర్నూలు జిల్లా యోగాంధ్ర నోడల్ అధికారిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆయుష్ డైరెక్టర్ జి. వీరపాండియన్ బుధవారం రోజున ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ జి. అమర్నాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.యోగా ద్వారా ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించి, ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. జిల్లా యంత్రాంగం,వైద్య సిబ్బంది, యోగా శిక్షకుల సహకారంతో యోగాంధ్ర కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తామని చెప్పారు.


### బొర్పట్లలో రూ.1,000 కోట్లతో 'థెరానైమ్ బయోలాజిక్స్'

# ప్లాంట్ ను ప్రారంభించిన మంత్రులు

**మంత్రి శ్రీధర్ బాబు... దామోదర్ రాజనర్సింహ**

**టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, అరబిందో చైర్మెన్ నిత్యానంద రెడ్డి**






**సంగారెడ్డి జిల్లా హత్నూర, జూన్ 03, వజ్ర భారతి న్యూస్, రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):**తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మార్చే దిశగా మరో కీలక అడుగు పడింది. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం బొర్పట్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన థెరానైమ్ బయోలాజిక్స్ తయారీ కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బుధవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు.ప్రముఖ ఔషధ సంస్థ 'అరబిందో ఫార్మా'కు చెందిన పూర్తి స్థాయి అనుబంధ విభాగమైన థెరానైమ్ బయోలాజిక్స్, దాదాపు రూ.1,000 కోట్ల భారీ పెట్టుబడితో ఈ అత్యాధునిక ప్లాంట్‌ను నిర్మించింది.ఈ భారీ ప్లాంట్ ఏర్పాటు ద్వారా స్థానిక ప్రాంతానికి చెందిన 1,500 మందికి పైగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు.ఈ బయోలాజికల్ ప్లాంట్‌లో క్యాన్సర్ ఇతర ప్రాణాంతక వ్యాధుల చికిత్సలో ఉపయోగించే అత్యాధునిక బయోలాజిక్స్, జీవ రసాయన మందులను తయారు చేయనున్నారు.ఇక్కడ ఉత్పత్తి అయ్యే నాణ్యమైన ఔషధాలను అమెరికా (యూఎస్ఏ) సహా పలు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయనున్నారు."మేడ్ ఇన్ తెలంగాణ" బ్రాండ్ ప్రతిష్టను ఇది ప్రపంచవ్యాప్తంగా మరింత పెంచుతుందని మంత్రి శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తం చేశారు.థెరానైమ్ సంస్థ గ్లోబల్ ఫార్మా దిగ్గజం ఎమ్ ఎస్ డి, సింగపూర్ విభాగంతో కుదుర్చుకున్న మాస్టర్ సర్వీస్ అగ్రిమెంట్ (ఎం ఎస్ ఏ) లో భాగంగా ఈ కాంట్రాక్ట్ బయో-మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్‌ను నిర్మించింది.ఈ ఫెసిలిటీలో అత్యాధునిక మేమాలియన్ సెల్ కల్చర్ బయోరియాక్టర్లతో పాటు, ఏడాదికి సుమారు 2.5 నుంచి 3 కోట్ల (25-30 మిలియన్) వయల్స్ ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉన్న ఐసోలేటర్ లైన్లను ఏర్పాటు చేశారు. తెలంగాణలో పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా, స్థానికులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఫార్మా రంగ పెట్టుబడులకు తెలంగాణ ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యతగా నిలుస్తుందని ఈ సందర్భంగా మంత్రి ?డి.శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో కంపెనీ ప్రతినిధులు, ఉన్నతాధికారులు, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ రాజి రెడ్డి,గుండ్ల మాచునూర్ సర్పంచ్ బి.శ్రీహరి, బోడపట్ల సర్పంచ్, గంగారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కిష్టారెడ్డిపేటలోయదేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలు

**ప్లాన్ కి విరుద్ధంగా అధికారుల ప్రజాప్రతినిధుల అండదండలతో అక్రమ నిర్మాణాలు**

**అధికారుల నిర్లక్ష్యం వల్లే అక్రమార్కుల ఆటలు**

**ప్రభుత్వ నిబంధన ఉల్లంఘించి అనుమతులు లేకుండా నిర్మాణాలు ఏంటి అంటున్న స్థానికులు**

**పటాన్చెరు అమీన్పూర్ మున్సిపల్,జూన్ 03,(వజ్ర భారతి న్యూస్):** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గంలోని కిష్టారెడ్డిపేట మున్సిపాలిటీ పరిధిలో అక్రమ భవన నిర్మాణాలు పెరుగుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అనుమతించిన ప్లాన్‌కు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు కేవలం నోటీసులు జారీ చేయడానికే పరిమితమవుతున్నారని, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని ఆరోపిస్తున్నారు. భవనాల విస్తీర్ణం, అదనపు అంతస్తుల కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కోల్పోతున్నదని స్థానికులు చెబుతున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతోనే ఈ అక్రమాలు కొనసాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పెరుగుతున్న అక్రమ నిర్మాణాలు భవిష్యత్తులో భద్రతా సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జిల్లా ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.




## జిన్నారం మునిసిపల్ లో ఘనంగా మాజీ మంత్రి వర్యులు హరీష్ రావుజన్మదిన వేడుకలు

**కేక్ కటింగ్ చేసిన శుభాకాంక్షలు తెలిపిన బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జిన్నారం వెంకటేష్ గౌడ్**

సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ కేంద్రంలో బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి వర్యులు హరీష్ రావు జన్మదిన సందర్బంగా బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జిన్నారం జి.వెంకటేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కటింగ్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేశం గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమ వీరుడని, తెలంగాణ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు ఆకాంక్షను కోరుకునే ప్రజా నాయకుడని, వారి యొక్క ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు,ఈ కార్యక్రమం లో కౌన్సిలర్స్, ప్రజాప్రతినిధులు, బి ఆర్ స్ పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరై పాల్గొనడం జరిగింది.



## మాజీ మంత్రి హరీశ్ రావును కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన....ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి జిల్లా జూన్ 03 వజ్ర భారతి న్యూస్):** హైదరాబాద్‌లో బీఆర్ఎస్ సీనియర్ నేత,మాజీ మంత్రి హరీష్ రావు ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, ఆయురారోగ్యాలతో పాటు ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ, హరీశ్ రావు ప్రజలతో మమేకమై పనిచేసే నాయకుడని, ఆయన రాజకీయ ప్రస్థానం ఎంతోమంది యువ నాయకులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన నాయకుల్లో హరీశ్ రావు ఒకరని కొనియాడారు.జన్మదిన సందర్భంగా హరీశ్ రావుకు శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రజలకు మరింత కాలం సేవలందించేలా భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమలో బండారి లక్ష్మారెడ్డి ఉన్నారు .

# పేకాట క్లబ్బులో రచ్చ

**పాలకొల్లు, (వజ్రభారతి) న్యూస్: జూన్ 3:** స్థానికంగా ఉన్న ఒక పేకాట క్లబ్ కొన్ని నిబంధనలతో నడుస్తోంది, జూ దరులు మధ్య వివాదం చోటు చేసుకోవడంతో ఇరువర్గాల మధ్య కొట్లాట జరిగినట్టు సమాచారం, ఇతర జిల్లాల నుండి పేకాట ఆడేందుకు పాలకొల్లు క్లబ్బుకు రావడం స్థానికులకు ఇతర జిల్లాల నుండి వచ్చే జూధరులు దీనిలో ప్రవేశించడం ఇష్టం లేక ఇరు వర్గాల మధ్య ఘర్షణ కొన్ని పర్మిషన్స్తో క్లబ్బు నడుస్తోంది, దీనివల్ల పోలీసులు సైతం జోక్యం చేసుకోవడానికి భయపడే పరిస్థితి లీగల్ గా హైకోర్టును ఆశ్రయిస్తే వాయిదాలకు వెళ్లాలంటే భయపడే సంఘటనలు గతంలో ఉండడంతో పోలీసు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు,

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు ధర్మారావు ఫౌండేషన్ సాయం.....



పాలకొల్లు, (వజ్రభారతి) న్యూస్: జూన్ 3: పట్టణ 28 వ వార్డు బి.ఆర్.బి స్కూల్ వెనుక పార్కు వీధిలో ఉంటున్న అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు ధర్మారావు ఫౌండేషన్ సాయం అందించింది . ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నాయుడు సుబ్బాయమ్మ, నాయకుల శ్రీను ల ఇల్లు దగ్ధమై నిరాశ్రయులయ్యారు . వీరికి మంత్రి నిమ్మల రామానాయుడు ధర్మారావు ఫౌండేషన్ నుంచి బియ్యం బస్తాలు, దుస్తులు, కిరాణా సరుకులు, వంట సామాగ్రి ఫౌండేషన్ సభ్యుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో పెచ్చెట్టి బాబు, పొట్నూరు అప్పన్న, పొట్నూరు శ్రీనివాస్, ఎర్ర బాబి, ద్వారపూడి సునీల్, కేల్లా లక్ష్మీనారాయణ, ధనాని సూర్య ప్రకాష్, రావూరి వెంకట అప్పారావు మేడిశెట్టి కేశవరావు, పీతల శ్రీను, కొలకలూరి శ్రీనివాస్, కడలి త్రిమూర్తులు తదితరులు. నాయకులు పాల్గొన్నారు,

## శిక్షణా కార్యక్రమాన్ని మూడు రోజులకు కుదించాలి : ఏపీటీఎఫ్.




**భీమవరం, వజ్రభారతి, జూన్ 3 :** కెపాసిటీ బిల్డింగ్ శిక్షణలు వేసవి సెలవులలో జరుగుతున్నందున తప్పనిసరిగా పని చేసే చోటే శిక్షణకు హాజరు కావాలని నిబంధన కాకుండా జిల్లా కేంద్రంలో ఏదో ఒకచోట శిక్షణకు హాజరయ్యే విధంగా అవకాశం ఇవ్వడం పట్ల ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ - 1938 పశ్చిమగోదావరి జిల్లా శాఖ పక్షాన హర్షం వ్యక్తం చేస్తున్నట్లు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమణ, హరికృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. వేసవి తాపం దృష్ట్యా 6 రోజుల శిక్షణా కార్యక్రమం షెడ్యూలును 3 రోజులకు కుదించాలని కూడా ఏపీటీఎఫ్-1938 పక్షాన విద్యాశాఖ అధికారులను కోరుచున్నామని అన్నారు. ఈ మీడియా సమావేశంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు వీరవల్లి రమేష్, జిల్లా అదనపు కార్యదర్శి వేమూరి శ్రీవల్లి, జిల్లా ఉపాధ్యక్షులు ఏ ఎన్ వి సుభాషిణి, టి.ఆనంద్ ప్రసాద్, పెద్దాడ రాజేశ్వరరావు, పొన్నమండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ రచనలుపై యువతకు అవగాహన

**వాసవి పెనుగొండ, వజ్రభారతి, జూన్ 3:** భారత రాజ్యాంగ ప్రధాన శిల్పి, విశ్వరత్న డా. బి.ఆర్. అంబేడ్కర్ రచనలు మరియు ప్రసంగాల 20 సంపుటాలనుఏ స్వకేపీ అండ్ డాక్టర్ . కె ఏ స్ . రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజీ , పెనుగొండ గ్రంథాలయానికి రామస్వామి--దేవదాసు 'చేయూత' సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ పుస్తకాలను కళాశాల సెక్రటరీ మరియు కరెస్పాండెంట్ డా. కె. రామచంద్రరాజు కి అందించారు.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, డా. అంబేడ్కర్ రచనలు సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువలపై యువతకు అవగాహన కల్పిస్తాయని పేర్కొన్నారు. ఆధునిక భారతదేశ నిర్మాణానికి దిశానిర్దేశం చేసిన అంబేడ్కర్ ఆలోచనలు ప్రస్తుత పరిస్థితుల్లో మరింత ప్రాసంగికతను సంతరించుకున్నాయని తెలిపారు.యువతలో అధ్యయనాసక్తిని పెంపొందించడంతో పాటు అంబేడ్కర్ భావజాలాన్ని విద్యార్థులకు చేరువ చేయాలనే లక్ష్యంతో విద్యాసంస్థలకు ఆయన రచనలను అందజేస్తున్నట్లు వివరించారు.కళాశాల యాజమాన్యం ఈ పుస్తకాలను గ్రంథాలయానికి అందజేసిన రామస్వామి--దేవదాసు 'చేయూత' సంస్థకు కృతజ్ఞతలు తెలిపింది.



# ఓటు నమోదు చేసుకునేలా బూత్ లెవెల్ ఏజెంట్లు కృషి చేయాలి

## వైయస్సార్సిపి సానుభూతిపరుల ఓట్లను తొలగించే కుట్రలు చంద్రబాబు సర్కార్ చేస్తుంది



**తణుకు, వజ్రభారతి, జూన్ 3:** ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదుచేసుకునేలా బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఏ) కృషిచేయాలని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన బీఎల్ఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. 24 ఏళ్ల తరువాత నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రక్షాళన కార్యక్రమాన్ని బీఎల్ఏలు శీర్యస్గా తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వైఎస్సార్సీపీ సానుభూతిపరుల ఓట్లు తొలగించే కుట్రలు చంద్రబాబు సర్కారు చేస్తుందని దానిని తిప్పికొట్టేందుకు సిద్దంగా ఉండాలని స్పష్టం చేశారు. బీఎల్ఏలు తమ విధివిధానాలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని బీఎల్వోల వెంట ఉంటూ ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేయించాలని సూచించారు.

**బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలి..**

ఓట్ల తొలగింపు, చేర్పుల్లో బీఎల్ఏ అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎస్ఐఆర్ జిల్లా ఇన్చార్జ్ యలమల నాగార్జునయాదవ్ అన్నారు. తణుకు పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన బీఎల్ఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా సర్ ప్రక్రియను చంద్రబాబు సర్కారు తమకు అనుకూలంగా మార్చుకునేందుకు కుట్రలు చేస్తున్నారని, ఆ కుట్రలను ఎదుర్కొనేందుకు బీఎల్ఏలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. ఆ కుటుంబం ఓట్లు మాకు రావనుకుంటే వాటిని తొలగించేందుకు కూటమి నాయకులు పూర్తి కసరత్తు చేస్తారని ఎట్టి పరిస్థితుల్లోను అవకాశం ఇవ్వకూడదని అన్నారు. తణుకు నియోజకవర్గంలోని 233 పోలింగ్ బూత్లకు సంబంధించిన బీఎల్ఏలు తమ విధి విధానాలను స్పష్టంగా తెలుసుకోవాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారంగా తణుకు నియోజకవర్గంలోని 233 బూత్లకు ప్రభుత్వ అధికారులను బూత్ లెవెల్ ఆఫీసర్స్గా (బీఎల్వో) నియమిస్తారని చెప్పారు. 2029లో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు బీఎల్ఏలు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ తణుకు నియోజకవర్గ పరిశీలకులు కొట్టు వెంకట నాగు, పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, వైఎస్సార్సీపీ లీగల్సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెలగల సాయిబాబారెడ్డి, పార్టీ స్టేట్ ఇంటలెక్చువల్ ఫోరం సెక్రటరీ చోడే గోపికృష్ణ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండల అధ్యక్షులు పెనుమర్తి వెంకటరామన్న, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, నియోజవర్గ యూత్ అధ్యక్షుడు కొత్తపల్లి చరణ్, నియోజకవర్గ ప్రచారకమిటీ అధ్యక్షుడు గెల్లా జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు చంద్రబాబు వెన్నుపోటు పొడిచి రెండేళ్లు పూర్తయింది

### చంద్రబాబు వెన్నుపోటు పొడిచి రెండేళ్లు అయిన సందర్భంగా పోస్టర్లను విడుదల చేశారు.

### మూలనున్న ముసలమ్మ కూడా బటన్ నొక్కుతాది అన్నావ్ మరి నువ్వు ఎందుకు నొక్కలేక పోతున్నావు.




**తణుకు, వజ్ర భారతి, జూన్ 3.:** ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి ఇస్తానన్న హామీలు అమలుచేయకుండా చంద్రబాబు వెన్నుపోటు పొడిచి రెండేళ్లు పూర్తి అయిందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు వైఎస్సార్సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు పోస్టర్ను కారుమూరితోపాటు వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యలమల నాగార్జునయాదవ్, తణుకు నియోజకవర్గ పరిశీలకులు కొట్టు వెంకట నాగు చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు ప్రజలకు సూపర్సిక్స్ అని ఏవేవో హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రభుత్వ హయాంలో బటన్ నొక్కి పేదలకు సంక్షేమం ఇవ్వడాన్ని అప్పట్లో వెటకారం చేస్తూ బటన్ నొక్కడం మూలనున్న ముసలమ్మ కూడా చేస్తుందని చంద్రబాబు విమర్శలు చేశారని కానీ నేడు కూటమి ప్రభుత్వం వచ్చి రెండేళ్లు అయినా ఒక్క బటన్ కూడా నొక్కకుండా ఇస్తానన్న సంక్షేమం ఇవ్వకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. జగన్ అప్పులు చేస్తున్నారని, ల్యాండ్ టైట్లింగ్ అంటూ అబద్దాలను ప్రచారం చేశాడని, కానీ నేడు ఇస్తానన్న హామీలు ఇవ్వకపోగా ప్రజల రక్త మాంసాలను పిప్పిపీల్చిచేస్తున్నాడని అన్నారు. మద్యం విచ్చలవిడి అమ్మకాలే కాకుండా ఎమ్మార్పీలపై అదనంగా రూ. 20 నుంచి రూ.30 వసూలు చేయడమే కాకుండా నైట్ పాయింట్లలో అందినకాడికి దోచేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని మద్యం, పేకాట, గంజాయి కేంద్రంగా మార్చేశారని దుయ్యబట్టారు. మద్యం విచ్చలవిడి అమ్మకాలతో మద్యం మత్తులో హత్యలు, మానభంగాలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నాయని విమర్శించారు. పీఫోర్తో రాష్ట్రంలోని పేదలందరినీ ఉద్ధరిస్తామని చెప్పి ఈ రెండేళ్ల కాలంలో ఎవరికి మంచి చేశారో చెప్పాలని స్పష్టం చేశారు. నిరుద్యోగభృతి అని, ఆడ బిడ్డ నిధి అనే పథకాల కోసం వేచిచూస్తున్నారని కానీ కూటమి నాయకులు దోచుకోవడం, దాచుకోవడానికే మక్కువ చూపుతున్నారని అన్నారు. తాజాగా తణుకులో అక్రమ మార్గంలో టీడీఆర్ బాండ్లకు తెరతీశారని రానున్నరోజుల్లో నిరూపిస్తానని అన్నారు నేడు జరుగుతున్న అన్ని అక్రమాలపైనా మా ప్రభుత్వం వచ్చిన తరువాత సిట్లు వేసి చట్టపరంగా మోసం చేసిన వారందరికీ శిక్షలు పడేలా చూస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, వైఎస్సార్సీపీ లీగల్సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెలగల సాయిబాబారెడ్డి, తణుకు, అత్తిలి, ఇరగవరం మండల అధ్యక్షులు పెనుమర్తి వెంకటరామన్న, పైబోయిన సత్యనారాయణ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, నియోజకవర్గ మహిళాధ్యక్షురాలు మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు కొత్తపల్లి చరణ్, నియోజకవర్గ ప్రచారకమిటీ అధ్యక్షుడు గెల్లా జగన్, ఎస్సీసెల్ తణుకు పట్టణ అధ్యక్షుడు పెనుమాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఛాంబర్స్ కళాశాలలో రెండవ రోజు అధ్యాపకులకు వృత్తి నైపుణ్య శిక్షణా కార్యక్రమం





**పాలకొల్లు, (వజ్రభారతి) న్యూస్ జూన్ 3:** స్థానిక బిఆర్ఆర్ అండ్ జీకేఆర్ చాంబర్స్ కళాశాల ప్రాంగణంలో బుధవారం అధ్యాపక వృత్తి నైపుణ్య శిక్షణ శిబిరం రెండవ రోజు నిర్వహించారు,ఈ కార్యక్రమానికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత , ప్రస్తుత ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ జివి చలం ముఖ్యఅతిథిగా, రిసోర్స్ పర్సన్ గా హాజరయ్యారు, ఆయన అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో , ఆధునిక అంతర్జాతీయ విద్య వ్యవస్థలో వచ్చే మార్పులకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని, అధ్యాపకులు తమ స్వీయ సబ్జెక్టు పై మాత్రమే పట్టు సాదిస్తే సరిపోదని బహుళ సబ్జెక్టుల పై కూడా అవగాహన పెంచుకోవడం వలన అధ్యాపకులు తమ స్థాయిలను పెంచుకోగలరని అంతే కాకుండా అధ్యాపకులు రీసెర్చ్ ఓరియంటెడ్ గా పరిశోధన పత్రాలపై ఆసక్తి పెంచుకోవాలని, అన్నారు, అత్యుత్తమ బోధనను ఇవ్వగలరని, అధ్యాపకులు నిరంతరం విద్యార్థి అని, నిరంతరం పరిశోధన పత్రాలపై దృష్టి సాధించాలని తద్వారా తమ సేవలు అందించు సంస్థలకు ఎన్ ఎ సి సి, ఎన్బీఏ, ఐ ఎస్ ఓ లాంటి ఉత్తమ ప్రామాణిక సంస్థలుగా గుర్తింపు లభిస్తుంది అన్నారు, కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.వి నరసింహారావు మాట్లాడుతూ తమ అధ్యాపకులకు ఇలాంటి ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహించుట ద్వారా అధ్యాపకుల పాఠ్యాంశాలపై పట్టు, సాంకేతిక వంటి అంశాలపై పునఃశ్చరణ జరిగి విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరావు మాట్లాడుతూ వివిధ విశ్వవిద్యాలయాల్లో ప్రముఖ ఆచార్యుల ద్వారా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా తమ అధ్యాపకులు కాలానుగుణంగా విద్య వ్యవస్థలు వచ్చే మార్పులను అవగతం చేసుకుని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు, ప్రొఫెసర్ జీవి చలం ని కళాశాల యాజమాన్యం పుష్పగుత్యాలతో సాలువతో సత్కరించారు, ఈ కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ కే.వీ సీతారామరాజు , కళాశాల ట్రెజరర్ ఆర్ ప్రవీణ్ భాను , కళాశాల అకాడమీకు అడ్వైజర్స్ డాక్టర్ ఏబిఎస్ మూర్తి , ఎన్.సీతారామారావు , జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కారుమూరి బాబ్జి , అధ్యాపకులు ఎన్ రవికుమార్, రాధా మాధవి ,జానకిరామయ్య, విజయలక్ష్మి, యాదిద్య, సిరిచందన మహంకాళి రావు, సత్యవేణి ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు,



# జగన్ ప్రభుత్వం ఒక్క టీచర్ పోస్ట్ కూడా ఇవ్వలేదు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించడం నిరుద్యోగుల జీవితాల్లో ఒక వరంగా భావించవచ్చు. డీఎస్సీలో అవకతవకలు జరిగాయని వైఎస్ఆర్సిపి నాయకులు బురద జలటం ఎంతవరకు సమంజసం.. ఐదు సంవత్సరాల కాలంలో ఒక్క ఉపాధ్యాయ పోస్టులు కూడా ఇవ్వకుండా కాలయాపన చేసి, నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది ఒక వైసిపి పార్టీ అని మాజీ జెడ్పిటిసి,జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు చుక్కా సాయిబాబు అన్నారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ అని చెప్పి అధికారంలోకి వచ్చి, ఒక్క ఏడాది కూడా జాబ్ క్యాలెండర్ వెయ్యని మోసకారి జగన్మోహన్ రెడ్డి అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఆధ్వర్యంలో జరిగిన డీఎస్సీ నియామకాల్లో అవినీతికి తావే లేదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే 1 లక్ష 96 వేల ఉపాధ్యాయుని పోస్టులు ఇవ్వడం జరిగిందని. గత ఐదేళ్ల వైసిపి పాలనలో ఇటునోటిఫికేషన్లు వేయక, అటు కంపెనీలను తరిమికొట్టే నిరుద్యోగులను నిలువనా జగన్ ముంచేసారని విమర్శించారు. ఈ సమావేశంలో మార్కెట్ డైరెక్టర్ కాసగాని రామకృష్ణ, సొసైటీ ప్రెసిడెంట్ కారెం బాబురావు, మాజీ ఏఎంసి డైరెక్టర్ కాకర చిట్టిరాజు, మరపట్ల వీర్రాజు, తామరపల్లి రాజేష్, మాండ్రు వెంకటేశ్వరరావు, షేక్ మస్తాన్, శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బి. మఠంలో బిడబ్ల్యూజేఏ నూతన కమిటీ ఏర్పాటు



**కడప జిల్లా, వజ్రభారతి ఇంచార్జ్ :** బ్రహ్మంగారి మఠం, జూన్ 3: బ్రహ్మంగారి మఠం మండలంలోని జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి మరియు మీడియా రంగంలో ఐక్యతను బలోపేతం చేసే లక్ష్యంతో బ్రహ్మంగారి మఠం వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ (బిడబ్ల్యూజేఏ) నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొని సంఘం భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ గుర్తింపు (అక్రిడిటేషన్) సాధన, సంక్షేమ కార్యక్రమాల అమలు, యువ జర్నలిస్టులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాలను ప్రధాన లక్ష్యాలుగా నిర్ణయించారు. నూతన కమిటీ సభ్యులు జర్నలిస్టుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. అలాగే మండలంలోని అన్ని మీడియా ప్రతినిధులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు. బ్రహ్మంగారిమఠం వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ లో నూతనంగా ఎన్నికైన గౌరవఅధ్యక్షులుగా ఆవులు దస్తగిరి నాయుడు,అధ్యక్షులుగా సారె రామానాయుడు,ఉపాధ్యక్షులుగా గగ్గెర వెంకట సుబ్బయ్య,ప్రధాన కార్యదర్శిగా పత్తి సురేష్,కోశాధికారిగా జాలా హృదనాథ్,సహాయ కార్యదర్శిగా గొల్లపల్లె విజయ్ చంద్ర ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ, మీడియా రంగంలో పనిచేస్తున్న విలేకరుల సంక్షేమం కోసం బిడబ్ల్యూజేఏ సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.

## గద్దర్‌పై వ్యాఖ్యలు - పవన్ కల్యాణ్‌పై ఫిర్యాదు

### చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎల్బీనగర్ పీఎస్‌లో న్యాయవాదుల ఫిర్యాదు

ఎల్బీనగర్: దివంగత ప్రజా గాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు గద్దర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేశారంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు దాఖలైంది. ఫిర్యాదు వివరాలు: న్యాయవాదులు ఫణీంద్ర భార్గవ్ ఎం, రవికుమార్ వొడ్యారపు స్టేషన్ హౌస్ ఆఫీసర్ వినోద్ కుమార్ కు రాతపూర్వక ఫిర్యాదు అందజేశారు. ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ "దివంగత గద్దర్ తన వద్దకు వచ్చి కారు అడిగారని, తాను వాహనం గిఫ్ట్‌గా ఇచ్చానని" వ్యాఖ్యానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అభ్యంతరం: గద్దర్ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి, విప్లవ గాయకుడు, దళిత వర్గానికి చెందిన గౌరవనీయ నాయకుడని, ఆయన జీవితాంతం ఆత్మగౌరవంతో బతికారని తెలిపారు. ఒక గొప్ప వ్యక్తిని తన దాతృత్వానికి లబ్ధిదారుగా చిత్రీకరించడం అవమానకరం, కల్పితం, కావాలని చేసిన పరువు నష్టం అని ఫిర్యాదులో ఆరోపించారు. చట్టపరమైన కోణం: గద్దర్ ఇప్పుడు లేరు కాబట్టి ఆ ఆరోపణలను ఖండించే అవకాశం లేదని, మరణించిన వ్యక్తిపై నిరాధార వ్యాఖ్యలు చేయడం నేరపూరిత పరువు నష్టం కిందకు వస్తుందని పేర్కొన్నారు. ఎస్సీ కమ్యూనిటీకి చెందిన నాయకుడిని బహిరంగంగా కించపరచడం వల్ల తెలంగాణ వ్యాప్తంగా ప్రజాగ్రహం వ్యక్తమవుతోందన్నారు. చర్యకు డిమాండ్: పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు బీఎన్ఎస్ కింద ఉద్దేశపూర్వక అవమానం, పరువు నష్టం, విద్వేషాలు రెచ్చగొట్టడంలతో పాటు ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం పరిధిలోకి వస్తాయని, వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి.. నెగ్గిపూడి టీడీపీ సమావేశంలో పిలుపు



**పెనుమంట్ర, వజ్ర భారతి,జూన్ 3:** పెనుమంట్ర మండలంలోని నెగ్గిపూడి పంచాయతీ పరిధి వనంపల్లిలో టీడీపీ యూనిట్ ఇంచార్జి వెలగల మల్లికార్జున్ రెడ్డి (మల్లి) ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో పార్టీ బలోపేతం, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారం, గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాల విస్తరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ శ్రేణులు ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ప్రతి ఇంటికీ చేరవేసేలా కృషి చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణతో పాటు గ్రామ సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై అభిప్రాయాలు వ్యక్తం చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు చిర్ల బాలాజీ రెడ్డి, కార్యదర్శి కట్టా వెంకట రమణ, కదలి వెంకటేశ్వరరావు, కట్టా బాలాజీ వన కుమార్, తోలేటి రాంబాబు, గుబ్బల వెంకటేశ్వరరావు, కదలి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు బొక్క నాగేశ్వరరావు, వాటర్ డిస్ట్రిబ్యూటరీ ఉపాధ్యక్షుడు కదలి సుబ్రహ్మణ్యం, వానపల్లి శ్రీనివాసరావు, ఎం.డి. గౌస్, వానపల్లి గోపి, మట్రివాడ గోపాలకృష్ణ, సిగిరెడ్డి శ్రీనివాస్, పేరూరి శ్రీనివాస్, బొక్క చంద్రశేఖర్, కొప్పిశెట్టి శ్రీను, కదలి జనార్దన్, బాలం రమేష్,కేత వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. పార్టీ నాయకులు, యూనిట్ ఇంచార్జిలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# 'కూటమి'లో విలేజ్ హెల్త్ సెంటర్లకు పునరుజ్జీవం

**అసంపూర్తిగా గాలికి వదిలేసిన వైసీపీ ప్రభుత్వం**

**17 సెంటర్లకు రూ. 2.10 కోట్లు కేటాయింపు**

**సీఎం సహాయనిధి నుంచి రూ. 8.20 కోట్లు పంపిణీ**

**తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ వెల్లడి**



**తణుకు, వజ్రభారతి, జూన్ 03:** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యంగా గాలికి వదిలేసిన విలేజ్ హెల్త్ సెంటర్లకు కూటమి ప్రభుత్వం పునరుజ్జీవం పోసిందని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం కారణంగా మధ్యలోనే వదిలేశారని చెప్పారు. తణుకు నియోజకవర్గంలో మొత్తం 17 సెంటర్లకు గాను రూ. 2.10 కోట్లు నిధులు కేటాయించిన కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఆసుపత్రిల్లో కనీస సదుపాయాలు, సౌకర్యాలపై దృష్టి సారించిందన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంకల్పంతో రాష్ట్రంలో వైద్యరంగానికి పెద్ద పీట వేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో వైద్యరంగాన్ని నిర్లక్ష్యం చేసిన వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సొంతంగా వైద్యం చేయించుకున్న వారు ఆర్థికంగా నష్టపోకూడదు అనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తుందని చెప్పారు. తణుకు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎప్పటి వరకు 1091 మందికి రూ. 8.20 కోట్లు మేర సీఎం సహాయ నిధి నుంచి చెక్కులు అందజేశామని పేర్కొన్నారు. తణుకు నియోజకవర్గంలోని అత్తిలి మండలంలో 8, ఇరగవరం మండలంలో నాలుగు, తణుకుమండలంలో నాలుగు చొప్పున విలేజ్ హెల్త్ సెంటర్లకు నిధులు కేటాయించిన ప్రభుత్వం త్వరలోనే వాటిని పూర్తి చేసేందుకు ప్రణాళికలు చేపట్టామని ఎమ్మెల్యే రాధాకృష్ణ వెల్లడించారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగరవేయడమే లక్ష్యం

**మండల అధ్యక్షుడు గోళ్ళ చంటిబాబు**

దేవిపట్నం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, స్థానిక శాసనసభ్యురాలు (ఎమ్మెల్యే) మిరియాల శిరీషదేవి ఆదేశాల మేరకు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఒక ముఖ్యమైన సమావేశం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు గోళ్ళ చంటిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గోళ్ల చంటిబాబు మాట్లాడుతూ.. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఇకపై ప్రతి నెలలోని మొదటి బుధవారం యూనిట్ పరిధిలో తప్పనిసరిగా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సమన్వయంతో, కష్టపడి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి గ్రామ పంచాయతీపై తెలుగుదేశం పార్టీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో దూసుకుపోవాలని కోరారు. పార్టీ బలోపేతానికి అందరి భాగస్వామ్యం అవసరమని చంటిబాబు పేర్కొన్నారు. ఈ నెలవారీ సమావేశాల్లో యూనిట్ పరిధిలోని మన తెలుగుదేశం పార్టీ బూత్ కన్వీనర్స్, కో-కన్వీనర్స్, గ్రామ పార్టీ అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు, నీటి సంఘాల అధ్యక్షులు, ఆలయ కమిటీల సభ్యులు మరియు సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు అందరినీ కలుపుకుని, సమన్వయంతో ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో క్లస్టర్ ఇంచార్జ్ ముచ్చు వీర వెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కీర్తికి గంగరాజు, సొసైటీ అధ్యక్షులు మాగాపు బాబురావు, మార్కెట్ డైరెక్టర్ జొన్నల నాని, నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షులు రేలంగి రాంబాబు, డైరెక్టర్ పల్లపాటి నాగేశ్వరరావు, మడకం శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షులు పోతులు వాసు, సిద్ధ వాసు, గ్రామ కమిటీ కార్యదర్శి ముచ్చిబాబురావు, యూనిట్ కోకన్వీనర్ ఈత శివాజీ, తెలుగు యువత అధ్యక్షులు జొన్నల శ్రీనివాస్, యూనిట్ కన్వీనర్ కుంజం రాజమణి, యూనిట్ కన్వీనర్ కర్రి రాజీవ్, యూనిట్ కన్వీనర్ కొమరం మల్లేశ్వరరావు, సుబ్బారెడ్డి, గనిశెట్టి వీరబాబు, పోశమ్మ గండి డైరెక్టర్లు, కరణం సత్తిబాబు, సుబ్రహ్మణ్యం, ప్రగడ దివేశ్వరరావు,మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# లోకాయుక్త ఆదేశాలను అమలు చెయ్యాలి

రహదారి విస్తరణలో భాగంగా భూ సేకరణ నిమిత్తం పరిహారం చెల్లించి భూమిన స్వాధీనం చేసుకోకుండా వదిలివేయడంపై లోకాయుక్త ఇచ్చిన ఆదేశాలను తక్షణమే అమలు చేసి ప్రభుత్వానికి లబ్ధి చేకూర్చాలని నగరానికి చెందిన లక్ష్మీనారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2009లో అమీర్పేట రహదారి విస్తరణ కోసం భూసేకరణ చేపట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా ఏ.కృష్ణమూర్తికి చెందిన 198 గజాల స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు నిర్ణయించి 86 లక్షలు చెల్లించిందని అన్నారు. భారీ పరిహారం తీసుకుని సదరు స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించకుండా అదే స్థలంలో భారీ భవనాన్ని నిర్మించి లక్షలు గడిస్తున్నారని అన్నారు. ఈ విషయమై తాను 15 ఏళ్లుగా పోరాటం చేస్తుండగా గత ఏడాది అక్టోబర్ మాసంలో లోకాయుక్త స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. ఆదేశాలను అమలుకు 6 నెలలుగా ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరుగుతున్న పట్టించుకోవడంలేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్థలాన్ని స్వాధీనం చేసుకొని ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని కోరారు.

# సమస్యల పరిష్కారంలో సాచివేత ధోరణి తగదు

**యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా**

బద్వేలు: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం సాచివేత ధోరణి అవలంబించడం తగదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబులు విమర్శించారు. బుధవారం ఉదయం ప్రొద్దుటూరులోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆ సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రతిపక్ష హోదాలో కూటమి పెద్దలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలిచ్చారని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే 12వ పిఆర్సీని అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ మెరుగైన వేతనాలను అమలు చేస్తామని, ఆర్థిక బకాయిలను నిర్ణీత గడువులోగా చెల్లిస్తామని, డిఏలను ఎప్పటికప్పుడు చెల్లిస్తామని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్లయినా హామీల అమలులో చిత్తశుద్ధి కనపరచడం లేదన్నారు. పిఆర్సీ గడువు ముగిసి ఇప్పటికే మూడేళ్లయిందని, అయినప్పటికీ పిఆర్సీ కమిషన్ ను ఏర్పాటు చేయడంలో తీవ్ర తాత్సారం చేస్తున్నదని విమర్శించారు. పిఆర్సీ అమలుకు నోచుకోకపోవడం వల్ల పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. 30 వేల కోట్ల పైబడిన బకాయిలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. సమస్యల పరిష్కారం కోసం రెండేళ్లుగా ఎదురుచూస్తున్నామని ప్రభుత్వం ఇప్పటికీ స్పందించకపోతే పోరాటమే శరణ్యమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీవన్మరణ సమస్యగా ఉన్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామన్న ప్రభుత్వం సాచివేత ధోరణిలో ముందుకు వెళ్తున్నదన్నారు. కరోనా మహమ్మరితో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు ఆలస్యం చేయడం తగదు అన్నారు. మూడేళ్లుగా సరెండర్ లీవ్ బకాయిలు చెల్లింపులు లేవన్నారు.